ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
మంగళవారం 5 నవంబరు 2024



ఏపీఎంఐపీ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపడుతున్న వెంకటేశ్వర్‌రెడ్డి



బాధ్యతలు చేపట్టిన ఏపీఎంఐపీ డైరెక్టర్

కడప రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు(ఏపీఎంఐపీ) జిల్లా డైరెక్టర్‌గా వెంకటేశ్వరరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన అన్నమయ్య జిల్లా హార్టికల్చర్ అసిస్టెంట్ డైరక్టర్‌గా పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీఎంఐపీ ద్వారా రైతులకు అందించాల్సిన సేవలను పారదర్శకంగా, త్వరితగతిన అందించి తద్వారా ప్రభుత్వ లక్ష్య సాధనకు పాటుపడతానన్నారు. ఏపీఎంఐపీ ద్వారా ప్రభుత్వం సబ్సిడీపై అందించే డ్రిప్ పరికరాలను అర్హులైన రైతులు సద్వినియోగం చేసుకుని అధిక ఉత్పత్తులు సాధించాలన్నారు.

'అ'.. ఆయనా..!

- నీటిపారుదలశాఖలో హల్‌చల్
- లోకేశ్ ఫ్రెండ్ అంటూ ప్రచారం
- చక్రాయపేటలో ఇల్లు కూల్చారనే నెపంతో..
- ఈఈని బాధ్యతలు చేపట్టనివ్వని వైనం

7



గురుకుల పాఠశాలలో ఇద్దరు విద్యార్థులకు పాముకాటు

7

ఉచిత సిలిండర్లపై గందరగోళం

- మొదటి సిలిండరుకు మార్చి వరకూ గడువు
- కేవైసీ మాత్రం తప్పనిసరి

6

అమాత్యా.. ఆలకించు



- సంక్షేమం ఓకే.. అభివృద్ధి కావాలి
- జిల్లావాసుల చిరకాల వాంఛ స్టీలు ఫ్యాక్టరీ
- ముందుకు సాగని ప్రాజెక్టులు
- కరువు మండలాల ఎంపికలో అన్యాయం
- అసంపూర్తిగా హజ్‌హౌస్ పనులు
- కూటమి ప్రభుత్వంపైనే ప్రజల ఆశలు
- టీడీపీకి జిల్లా కార్యాలయం కరువు
- పార్టీలో ఎవరి దారి వారిదే
- సొంత పార్టీ నగర అధ్యక్షుడిపైనే దాడి
- కలిసికట్టుగా నడిపించే నాయకుడు కరువు
- యథేచ్ఛగా ఇసుక అక్రమరవాణా
- నేడు జిల్లా సమీక్షా మండలి.. కూటమి నేతల సమన్వయ సమావేశం
- హాజరు కానున్న మంత్రి సవిత

కూటమి ప్రభుత్వం కొలువుతీరిన తరువాత తొలిసారిగా మంగళవారం జిల్లా సమీక్ష మండలి సమావేశం జరగనుంది. ఈ కార్యక్రమానికి ఇన్‌చార్జి మంత్రి సవిత హాజరు కానున్నారు. అలాగే సమన్వయ కమిటీ సమావేశం జరగనుంది. వైసీపీ హయాంలో సమీక్ష మండలి సమావేశాలను నిర్లక్ష్యం చేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చాక మళ్లీ సమీక్ష మండలి సమావేశం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో అభివృద్ధిపై జనం.. భరోసా కోసం పార్టీ జెండా మోసిన కార్యకర్తలు ఎంతో ఆతృతగా ఎదురు చూస్తున్నారు. మంత్రి సవిత రానున్న సందర్భంగా జిల్లాలో అభివృద్ధి, పారిశ్రామిక, సాగునీటి ప్రాజెక్టుల దుస్థితిపై, టీడీపీ, కూటమి నేతల సఖ్యతపై ఆంధ్రజ్యోతి అందిస్తున్న ప్రత్యేక కథనం.



2018లో మైలవరం మండలం కంబాలదిన్నె వద్ద చంద్రబాబు ఆవిష్కరించిన స్టీల్ ఫ్యాక్టరీ పైలాన్



ఎండిపోతున్న వేరుశనగ పంట



అసంపూర్తిగా ఉన్న సర్వరాయ సాగర్ ప్రాజెక్టు

(కడప-ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో కూటమికి జిల్లా జనం బ్రహ్మరథం పట్టారు. కడప పార్లమెంటు పరిధిలో ఏడు అసెంబ్లీ స్థానాల్లో ఐదుచోట్ల కూటమి అభ్యర్థులను గెలిపించారు. ఇప్పుడు జనమంతా కూటమి ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకున్నారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఎన్నికల హామీల మేరకు సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేస్తున్నారు. సంక్షేమం వరకు ఓకే.. జనాల్లో కూడా ఫీల్ గుడ్ ఉంది. అయితే పెండింగు సాగునీటి ప్రాజెక్టులు, ఉక్కు పరిశ్రమ, కొప్పర్తి పారిశ్రామికవాడలో పరిశ్రమల ఏర్పాటులో దృష్టి సారించలేదు. ఇక కరువు మండలాల్లో జిల్లాకు అన్యాయం జరిగింది. కడప, పులివెందుల, ప్రొద్దుటూరు, బద్వేలులో పలు అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. వీటన్నింటినీ గట్టెక్కించి కూటమి ప్రభుత్వం మార్కు డెవలప్‌మెంటును మాజీ సీఎం జగన్ సొంతజిల్లాలో చూపించాల్సిన బాధ్యత ఉంది.

సాగునీటి ప్రాజెక్టులు

గాలేరు నగరి సుజల స్రవంతి ఫేజ్-1లో భాగమైన సర్వరాయసాగర్, వామికొండ రిజర్వాయర్ల నిర్మాణం సాగుతూనే ఉంది. అవి ఎప్పటికి పూర్తయి రైతుల పొలాలకు నీళ్లు అందుతాయో తెలియని పరిస్థితి. ఇక్కడ పనుల కోసం రూ.212 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. ఇవేకాకుండా తెలుగుగంగ ప్రాజెక్టు నుంచి చివరి ఆయకట్టుకు నీరు అందలేదు. అసంపూర్తి కాల్వలు ఇతర పనుల వల్ల ప్రాజెక్టుల లక్ష్యం ఇంకా నెరవేరలేదు. గత టీడీపీ హయాంలోనే గండికోటకు నీరు తీసుకువచ్చారు. పులివెందులకు కూడా నీళ్లిచ్చారు. మళ్లీ చంద్రబాబు సీఎం కావడంతో ప్రాజెక్టుల నిర్మాణంపై రైతులు ఎన్నో ఆశలు పెట్టుకుని ఉన్నారు.

కరువు మండలాలకు అన్యాయం

జిల్లాలో ఖరీఫ్ ఆరంభంలో సమృద్ధిగా వర్షాలు కురిసినప్పటికీ విత్తు వేసే సమయానికి వర్షం ముఖం చాటేసింది. దీంతో కరువు పరిస్థితులు నెలకొన్నాయి. జూలైలో 98.5 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 58 మి.మీ నమోదైంది. 44.2 లోటు వర్షపాతం. ఆగస్టులో 120మి.మీకి గాను 92 మి.మీ నమోదైంది. 23.3మి.మీ లోటు వర్షపాతం. సెప్టెంబరులో 74.7కు గాను 28.3మి.మీ నమోదైంది. వరుసగా 21 రోజులు వర్షం పడకపోతే డ్రైస్పెల్‌గా పరిగణిస్తారు. జిల్లాలో కలసపాడు, తొండూరు, వేంపల్లె, పోరుమామిళ్ల, గోపవరం, అట్లూరు, ఒంటిమిట్ట, సిద్దవటం, బద్వేలు మండలాల్లో డ్రైస్పెల్ ఏర్పడింది. కానీ కరువు మండలాల జాబితాలో ఒక్క మండలం కూడా లేదు. ఇది రైతులను తీవ్ర నిరాశకు గురిచేసింది.

స్టీలు ఫ్యాక్టరీపై ఎన్నో ఆశలు

జిల్లా ప్రజల చిరకాల వాంఛ స్టీలు ఫ్యాక్టరీ. వైఎస్ హయాంలో జమ్మలమడుగు సమీపంలో బ్రాహ్మణీ స్టీలుఫ్యాక్టరీ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఆయన మరణానంతరం అటకెక్కింది. రాష్ట్ర విభజన చట్టంలో కడపలో స్టీలు ఫ్యాక్టరీ నిర్మాణాన్ని చేర్చారు. అయితే కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో అప్పటి సీఎం చంద్రబాబే స్టీలు ఫ్యాక్టరీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 2019లో జగన్ సీఎం అయ్యారు. మూడేళ్లలో స్టీలుఫ్యాక్టరీ నిర్మిస్తామని జగన్ హామీ ఇచ్చారు. రెండుసార్లు శంకుస్థాపన చేశారు. అయినా స్టీలు ఫ్యాక్టరీ ముందుకు సాగలేదు. కొప్పర్తి పారిశ్రామికవాడలో నీటి కొరత ఉంది. దీంతో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు రావడం లేదు. గతప్రభుత్వ హయాంలో రూ.150 కోట్లతో తెలుగుగంగ నుంచి నీరు తీసకువచ్చే పనులు చేపట్టారు. అవి అలాగే ఉన్నాయి. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు దక్కాలంటే కొప్పర్తి పారిశ్రామికవాడలో పరిశ్రమలు, ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తికావాల్సి ఉంది. కడప జిల్లాను హార్టికల్చర్ హబ్‌గా మారుస్తామని మంత్రి నారా లోకేశ్ పాదయాత్రలో చెప్పుకొచ్చారు. జిల్లాలో పండ్లతోటలు పెద్దఎత్తున సాగులో ఉన్నాయి. రైతులకోసం ప్రత్యేక పాలసీ తీసకురావాల్సి ఉంది.



ఆగిన పనులు

విభజిత రాష్ట్రానికి చంద్రబాబు మొదటిసారి ముఖ్యమంత్రి అయిన సమయంలోనే కడప నగర శివారులో హజ్‌హౌస్ నిర్మించారు. టీడీపీ హయాంలోనే సుమారు 80శాతానికి పైగా పూర్తయింది. అనంతరం కొలువుదీరిన వైసీపీ దానిని పూర్తిగా అటకెక్కించింది. ఆ పనులు పూర్తికావాలి. కడపలో బుగ్గవంక సుందరీకరణ పనులు సాగుతూనే ఉన్నాయి. బ్యూటిఫికేషన్, లైటింగ్ సిస్టం ఇంకా అందుబాటులోకి రాలేదు. గత వైసీపీ హయాంలో రోడ్ల విస్తరణ, వరద కాల్వ నిర్మాణం చేపట్టారు. అవి అర్థంతరంగా ఆగిపోయాయి. వర్షం వచ్చినప్పుడల్లా కడప ముంపునకు గురవుతోంది. రూ.70 కోట్లతో స్ట్రామ్ డ్రెయిన్ల నిర్మాణం చేపట్టినా అవి ఇంకా పూర్తికాలేదు. దీంతో జనం ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వంలో రూ.340 కోట్లలో ఆర్కిటెక్చర్ యూనివర్శిటీ పనులకు శంకుస్థాపన చేశారు. అవి అంతటితో ఆగిపోయాయి. ప్రొద్దుటూరు, బద్వేలు, పులివెందుల, పోరుమామిళ్లలో పలు అభివృద్ధి పనులు అటకెక్కాయి.

టీడీపీలో ఎవరి దారి వారిదే

సార్వత్రిక ఎన్నికల్లో కూటమికి జనం బ్రహ్మరథం పట్టారు. కడప, మైదుకూరు, కమలాపురం, ప్రొద్దుటూరు అసెంబ్లీస్థానాలను టీడీపీకి.. జమ్మలమడుగును బీజేపీకి కట్టబెట్టారు. ఈ విజయంతో జిల్లాలో టీడీపీని బలోపేతం చేసి తిరుగులేని శక్తిగా చేయాల్సిఉంది. అయితే టీడీపీ నేతల మధ్య సఖ్యత లేదు. కడుపులో కత్తులు పెట్టుకుని కౌగిలించుకుంటారనే విమర్శ ఉంది. జిల్లా క్యాడర్‌ను ఏకతాటిపై నడిపించే నాయకులు లేరు. గ్రూపుదిషాపులకు సంబంధించి టీడీపీ నేతల మధ్యనే విభేదాలున్నాయి. ఇసుక తరలింపు, మట్టి తవ్వకాల్లో కూటమి నేతలు వైసీపీ వారిని మించిపోయారంటారు. ఏకతాటిపై నడిపించే నాయకుడు ప్రస్తుతానికి టీడీపీకి కరువయ్యారని, ప్రతిపక్షంలో ఉన్నప్పుడే నయం అప్పుడు అందరినీ ఆదరిచేవారని.. అధికారంలోకి వచ్చాక కార్యకర్తలను పట్టించుకోవడంలేదనే భావన టీడీపీ శ్రేణుల్లో ఉంది. కేవలం బంధువులు, వైసీపీ నుంచి వచ్చిన కొందరికి మాత్రమే కొన్ని నియోజకవర్గాల్లో



ప్రాధా... ఉందని వాపోతున్నారు. కడప టీడీపీ నగర అధ్యక్షుడు సానపురెడ్డి శివకొండారెడ్డిపై సొంత పార్టీ నేతలే దాడి చేయడం తీవ్ర కలకలం రేపింది. ఇక పార్టీ కోసం కష్టపడ్డ టీడీపీ సీనియర్ నేతలను కొందరు పట్టించుకోవడం లేదు. దీంతో వారిలో నిరాశ ఎక్కువవుతోంది. పార్టీకి జిల్లా కేంద్రమైన కడపలో సొంత కార్యాలయమే లేదంటే.. పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతుందంటున్నారు.

నేడు ఇన్‌చార్జి మంత్రి రాక

జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత మంగళవారం పెనుగొండ నుంచి బయలుదేరి కడపకు ఉదయం 10ంటలకు ఆర్‌అండ్‌బీ గెస్టుహౌస్‌కు చేరుకుంటారు. ఒంటిగంట వరకు నేతలతో సమన్వయ సమావేశం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 2 నుంచి 5గంటల వరకు కలెక్టరేట్‌లో జిల్లా అభివృద్ధిపై సమీక్ష నిర్వహిస్తారు. సాయంత్రం 5.45కు విజయవాడకు రైలులో బయల్దేరుతారు.



కూటమి నేతల మధ్య సఖ్యత కరువు

రాష్ట్రస్థాయిలో కూటమి నేతల మధ్య సమన్వయం కోసం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి పాటుపడుతున్నారు. అయితే జిల్లాలో కూటమి నేతల మధ్య సఖ్యత లేదంటారు. అందరూ కలిసి ఒక్క కార్యక్రమం కూడా ఇప్పటిదాకా చేయలేదు. ఇది కూడా బీజేపీ, జనసేనలో నిరాశ పెంచుతోంది. వీరి మధ్య సమన్వయం చేసి కార్యకర్తల కష్టసుఖాలను పంచుకునే వారు లేరు.

నిబంధనలు బేఖాతర్..!

- ప్రైవేట్ విద్యాసంస్థ ఆధిపతికి...
- జడ్పీ ఉన్నతాధికారుల జీ హుజూర్
- రూ.4.14 కోట్ల నూతన కాంప్లెక్స్ ధారాదత్తం
- టెండర్లు పిలవకుండానే అగ్రిమెంట్
- నాడు వైసీపీ.. నేడు కూటమి పెద్దల అండదండలు
- సౌకర్యాల పేరుతో కాంప్లెక్స్ గోడలు కూల్చివేత
- చోద్యం చూస్తున్న అధికారులు



కడప రూరల్, నవంబర్ 4 (ఆంధ్రజ్యోతి): కడప నగర నడిబొడ్డులో రూ.4.14 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన కాంప్లెక్స్ సముదాయాన్ని నిబంధనలు బేఖాతర్ చేస్తూ ఓ ప్రైవేట్ విద్యాసంస్థ ఆధిపతికి కట్టబెట్టారు. టెండర్లను పిలవకుండానే అద్దె పేరుతో మూడేళ్లకు అగ్రిమెంట్ రాసిచ్చారు. లక్షలు చేతులు మారడంతో జిల్లా పరిషత్ ఉన్నతాధికారులు ఆయనకు జీ హుజూర్ అన్నారు. దీంతో విద్యాంస్థల అధినేత అగ్రిమెంట్ నిబంధనలను తుంగలో తొక్కి కాంపెక్స్ సముదాయ గోడలను కూల్చివేసి ఇనుప నిచ్చెన ఏర్పాటు చేసుకున్నారు.

ఒక్కొక్క గది రూ.10 వేలకు..

నగర నడిబొడ్డులోని జడ్పీ కార్యాలయ ఆవరణలో రూ.4.14 కోట్ల బీఆర్‌జీఎఫ్ నిధులతో మూడంతస్తులతో నూతన కాంప్లెక్స్‌ను జడ్పీ శాఖ ఏర్పాటు చేసింది. కాంప్లెక్స్‌కు 12 గదుల చొప్పున మొత్తం మూడు ఫ్లోర్లలో 36 గదులు నిర్మించారు. ఇందులోని రెండు, మూడవ ఫ్లోర్‌లోని 18 గదులను ఒక్కొక్క గదిని రూ.10వేల అద్దెతో బీరంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చారిటబుల్ ట్రస్ట్‌కు అగ్రిమెంట్ రాసిచ్చారు.

ఆ విద్యాసంస్థపై 'కాసుల' ప్రేమ

అప్పటి వైసీపీ ప్రభుత్వ పాలనలో 2023 జూన్‌లో జడ్పీశాఖ రూ.1.5 కోట్లతో జడ్పీ కాంప్లెక్స్‌ను నిర్మించాలనుకుంది. ఈ విషయం ఓ ప్రైవేట్ విద్యాంస్థల అధినేత దృష్టికి చేరింది. దీంతో ఆయన రంగంలోకి దిగారు. తన విద్యాసంస్థ అవసరాలకు రెండు ఫ్లోర్లు కావాలని ఇందుకు ఒక్కొక్క గదికి రూ.లక్ష చొప్పున ముందస్తు అడ్వాన్స్ చెల్లించడంతో పాటు ఇందుకు సమ్మతించిన ఉన్నతాధికారులకు, పాలకమండలి పెద్దలకు పెద్దఎత్తున 'కాసుల' ప్రేమ చూపించారని అంటారు. దీంతో జడ్పీ కాంప్లెక్స్ అంచనా విలువ రూ.1.5 కోట్ల నుంచి రూ.4.18 కోట్లకు పెరిగిపోయింది. నాడు వైసీపీ ప్రభుత్వ పెద్దలు.. నేడు కూటమి ప్రభుత్వ పెద్దల అండ మెండుగా ఉండడం వలనే నగర నడిబొడ్డులోని జడ్పీ కాంప్లెక్స్ సముదాయం బీరంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చారిటబుల్ ట్రస్ట్‌కు దక్కిందని ప్రచారం సాగుతోంది. జడ్పీ కాంప్లెక్స్ నిర్మాణ దశలో ఉన్నప్పుడే రెండవ, మూడవ అంతస్తులను బీరంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చారిటబుల్ ట్రస్ట్‌కు అప్పటి జడ్పీ సీఈవో కేటాయించడంతో ఈ వ్యవహారంపై పెద్ద ఎత్తున దుమారం రేగింది. టెండర్లు పిలవకుండా ప్రైవేట్ విద్యాసంస్థకు ఎలా కేటాయిస్తారని సీపీఐ నేతలు, విద్యార్థి సంఘాలు మండిపడ్డాయి. అప్పటి సీఈవోకు గత వైసీపీ నేతల అండ ఉండడంతో సీపీఐ అందోళనలను పట్టించుకోలేదు. తరువాత టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం కేటాయింపులపై గుర్రుమనడంతో.. ఆ ప్రతిపాదనలను సీఈవో పక్కనపెట్టారు. దీంతో విద్యాసంస్థల అధినేత కూటమి ప్రభుత్వంలోని ఓ పార్టీలో చేరారు. దీంతో అక్టోబర్ 3న జడ్పీ కాంప్లెక్స్ నూతన సముదాయంలోని 36 గదులలో 18 గదులను బీరంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చారిటబుల్ ట్రస్ట్‌కు అప్పటి సీఈవో టెండర్లు లేకుండానే అద్దెపేరుతో మూడేళ్లకు కట్టబెట్టారు.

నిబంధనల ప్రకారం చర్యలు..

జడ్పీ ఆవరణంలో నూతనంగా నిర్మించిన కాంప్లెక్స్ సముదాయంలోని రెండు, మూడవ అంతస్తులోని 18 గదులను బీరంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చారిటబుల్ ట్రస్ట్‌కు అద్దెకు ఇచ్చారు. ఈ మేరకు జడ్పీ జనరల్ బాడీ సమావేశం, స్టాండింగ్ కమిటీ సమావేశం ఆమోదంతో అప్పటి సీఈవో కేటాయించారు. టెండర్లు లేకుండా జడ్పీ సర్వసభ్యసమావేశం, స్టాండింగ్ కమిటీ సమావేశం అప్రూవల్‌తో ఇవ్వడానికి వీలు ఉందా లేదా అనే విషయంపై పరిశీలిస్తున్నాం. త్వరలోనే క్లారిటీ తీసుకుని తదనుగుణంగా చర్యలు చేపడతాం. జడ్పీశాఖ అనుమతి లేకుండా షాపింగ్ కాంప్లెక్స్ రెండవ అంతస్తులోని ప్రొటెక్షన్ వాల్ తొలగించడంపై బీరంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులకు నోటీసులు పంపించాము.

- ఓబులమ్మ, జడ్పీ సీఈవో



జడ్పీ షాపింగ్ కాంప్లెక్స్ మధ్యలో పైఅంతస్తులకు వెళ్లడానికి ఉన్న మెట్లు



నిర్మాణాలను కూలగొట్టి..

నూతన జడ్పీ కాంప్లెక్స్ సముదాయంలోని రెండవ, మూడవ అంతస్తులను దక్కించుకున్న బీరంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు అధికారుల అనుమతులు లేకుండానే గోడలను కూలగొట్టారు. అక్కడ ఇనుప నిచ్చెన ఏర్పాటు చేసుకున్నారు. సదరు స్థలంలో మరో రెండు గదులు ఏర్పాటుచేసేందుకు జడ్పీ అధికారులు పిల్లర్లతో పునాదులు నిర్మించి గోడలు కూడా కట్టారు. కానీ విద్యాసంస్థల అధినేత ఎలాంటి అనుమతులు లేకుండా వీటిని కూలగొట్టి నిచ్చెన ఏర్పాటు చేసుకున్నారు. మరో విశేషం ఏమిటంటే.. పై అంతస్తులకు వెళ్లడానికి కాంప్లెక్స్ మధ్యలో మెట్లు (తాపలు) ఉన్నాయి. అయినా వారు నిచ్చెన ఏర్పాటు చేసుకున్నారు.

అనుమతులు లేకుండా గోడలు కూల్చేసి ఇనుప నిచ్చెన ఏర్పాటు చేసిన దృశ్యం

ప్రజా సమస్యలను అలక్ష్యం చేయొద్దు

- ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్

కడప కలెక్టరేట్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు సమర్పించే బాధితులు సమస్యలను అలక్ష్యం చేయక వెంటనే పరిష్కారించాలని ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమం జరిగింది. ఇన్‌చార్జి కలెక్టర్‌తో పాటు డీఆర్వో గంగాధర్ గౌడ్, డీఆర్డీఏ పీడీ ఆనంద్ నాయక్, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, స్పెషల్ కలెక్టర్ శ్రీనివాసులు హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ కార్యాలయాల్లో అర్జీలు సమర్పించే అర్జీదారులను పదే పదే కార్యాలయాల చుట్టు తిప్పొద్దన్నారు. నిర్దేశిత గడువులోపు విచారణ చేసి పారదర్శకంగా అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలన్నారు.

కడప నగరం అజాద్‌నగర్‌కు చెందిన ఖాసీంబీ తనకు గతంలో ప్రభుత్వం నుంచి ఇంటి స్థలం మంజూరు అయిందని, ఇల్లు నిర్మించి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సీకేదిన్నె మండలం నాయనివారిపల్లెకు చెందిన గ్రామస్తులు ఫిర్యాదు చేస్తూ తమ పూర్వీకుల నుంచి సర్వే నెంబర్ 468-2బిలో 3.26 ఎకరాలలో శ్మశానం ఉందన్నారు. ఇటీవల పులివెందులకు చెందిన విశ్వనాథరెడ్డి ఆ భూమి తనకు ఆన్‌లైన్లో ఉందని, ఆ భూమిలోకి వస్తే చంపుతామని బెదిరిస్తున్నాడని అన్నారు. జమ్మలమడుగు మండలం మోరగుడికి చెందిన ధనలక్ష్మి తన కుమారుడు వికలాంగుడని వికలాంగ పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. వీరితో పాటు పలువురు అర్జీలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కార్తీకదీప శోభ





మృత్యుంజయకుంట శివాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు



కడప కల్చరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా జిల్లాలోని శివాలయాలు తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకాలు, భక్తుల శివనామస్మరణతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. మహిళా భక్తులు సాయంత్రం పెద్దఎత్తున ఆలయాలను సందర్శించి అత్యంత భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలు వెలిగించారు. కడప నగరంలోని మృత్యుంజయకుంటలోని మృత్యుంజయేశ్వర స్వామి ఆలయం, మోచంపేట రాజరాజేశ్వరిదేవి గుడి, సోమసుందరేశ్వర స్వామి ఆలయం, దేవునికడప సోమేశ్వరాలయంతో పాటు ఎర్రముక్కపల్లె, నబీకోట శివాలయాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో కార్తీక దీపాలు వెలిగించారు. సాయంత్రం ఆలయాల్లో అర్చకులు ఆకాశదీపాలు వెలిగించి శివునికి ప్రత్యేక అలంకరణ చేశారు.

దయనీయ స్థితి నుంచి.. డైరెక్టర్

- పోరంబోకు అనుకున్న చోటే..
- ఊరందరిచేతా ప్రశంసలు
- తెలుగుతో పాటు తమిళం, కన్నడ సినిమాలకు దర్శకత్వం





డైరెక్టర్ శ్రీనివాస్

రామసముద్రం, నవంబరు 4: చిన్నతనంలోనే సినిమాలపై మోజుతో బడి ఎగ్గొట్టేవాడు. దర్శకుడు కావాలని కలలు కనేవాడు. కూలిపనులతో జీవనం సాగించే కుటుంబం కావడంతో.. బతక డానికి ముద్ద దొరకని దయనీయ స్థితి అయినా.. మొండిగా ముందుకెళ్లి ముళ్లబాటను పూలబాటగా మార్చుకున్నాడు. పోరం బోకు అని ముద్రపడ్డ ఊరిలోనే.. అందరి చేతా ప్రశంసలు అందుకున్నాడు. ఆయనే సినిమా డైరెక్టర్ శ్రీనివాస్. ఇందుకు సంబంధించి వివరాలు శ్రీనివాస్ మాట ల్లోనే..

బడి ఎగ్గొట్టి సినిమాలకు..

రామసముద్రం మండలం ఊలపాడు పంచాయతీలో కూలి పనులు చేస్తూ జీవనం సాగించే నాగమ్మ, గెవప్ప దంపతులకు నలుగురు కుమారులు. అందులో నేను నాలుగవ వాడిని. నాకు చిన్నతనం నుంచి సినిమాలంటే మక్కువ ఎక్కువ. ఊరిలో ప్రాథమిక విద్య అయిన తర్వాత రామసముద్రం మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరవ తరగతిలో చేరాను. అయితే సినిమాల మోజుతో క్లాసులు ఎగ్గొట్టి మండల కేంద్రం లోనే ఉన్న థియేటర్‌కు వెళ్లి సినిమాలు చూసేవాన్ని. ఇది గమనించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నన్ను పలుమార్లు మందలిం చారు.

ఇంట్లో చెప్పకుండా చెన్నై..

బడికి వెళ్లడం చదువుకోవడం నాకు కష్టంగా ఉండేది. ఎంతసేపూ సినిమాలే.. దీంతో ఇక చదువు వద్దనుకుని తొమి దవ తరగతి చదువుతున్న సమయం లోనే తల్లిదండ్రులకు తెలియకుండా చెన్నై వెళ్లిపోయాను. చేతిలో చిల్లిగవ్వ లేని స్థితి. రోడ్డుపక్క పడుకునే వాడిని. ఏది దొరికితే అది తినేవాడిని. సినిమా ఇండస్ట్రీపై మోజుతో ఎన్నో తిండిలేని నిద్రలేని రాత్రులు గడిపాను. బతకడా నికి చిన్నాచితక పనులు చేసుకుంటూ.. సినిమా ఆఫీసుల చుట్టూ తిరిగేవాడిని. ఇంత దయనీయ స్థితిలోనూ చెన్నైలోని అడియార్‌లో డిప్లమా ఇన్ ఫిల్మ్ టెక్నా లజీ పూర్తి చేశారు. అది నా కల సాకా రానికి, పురోగతికి పునాదిరాయిగా మారింది. డిప్లమా పూర్తి అయిన తర్వాత జన్మనక్షత్రం సినిమాకు క్లాప్ అసిస్టెంట్‌గా పనిచేసినందుకు ఐదువం దల రూపాయల పారితోషకం ఇచ్చారు. ఇదే నా మొదటి పారితోషికం.

మొదటి సినీ గురువు తక్కాలి శ్రీనివాసన్..

డిప్లమా పూర్తి చేసిన తర్వాత తమిళ డైరెక్టర్ తక్కాలి శ్రీనివాసన్ దగ్గర అసి స్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశాను. శ్రీనివాసన్ డైరెక్షన్‌లో అప్పటికే 499 ఎపిసోడ్లు పూర్తి చేసుకున్న అగ్ని సీరియల్‌కు 500 ఎపిసోడ్‌కు నేను మొదటిసారి డైరెక్టర్‌గా వ్యవహరించాను. ఇందుకుగాను నాకు రూ.50వేలు పారితోషకం ఇచ్చారు.

పోరంబోకు డైరెక్టర్‌గా..

తమిళంతో పాటు తెలుగులో చాలా సినిమాలకు పనిచేశాను. తెలుగులో కొన్ని హిట్ సినిమాలకు కథా సహకారం అందించాను. తెలుగులో మొట్టమొదట పోరంబోకు సినిమాకు డైరెక్టర్‌గా పనిచే శాను. ఆ తర్వాత వరుసగా నిను చూడక నేనుండలేను, భూతం సినిమాలకు డెరెక్ష న్ చేశాను. తమిళంలో లొడుకు పాండి, కన్నడంలో కరోడుపతి సినిమా లకు దర్శకత్వం వహించాను. ఇప్పుడు ఊరికొక్కడు సినిమా షూటింగ్ పూర్తి అయి విడుదలకు సిద్ధమవుతోంది.



పోరంబోకు సినిమా షూటింగ్‌లో డైరెక్టర్ శ్రీనివాస్

సేవా కార్యక్రమాలలో శ్రీనివాస్

సినిమా డైరెక్టర్ శ్రీనివాస్ సొంత ఊరికి వచ్చినప్పుడు.. ఊరిలో పారి శుధ్యం పనులు స్వయంగా చేపట్టి అందరికి ఆదర్శంగా ఉంటున్నారు. అలాగే గ్రామ ప్రజల ఆరాధ్య దైవం అయిన గెవితిమ్మరాయస్వామి వారి ఆలయ అభివృద్ధికి గ్రామస్తులతో కలిసి తన వంతు కృషి చేస్తున్నారు. కృషి, పట్టు దల ఉంటే ఏ పనైనా సాధించవచ్చని.. ఇందుకు శ్రీనివాస్ నిదర్శనం అని గ్రామ స్తుల నుంచి అభినందనలు పొందుతు న్నారు.



నిను చూడక నేనుండలేను సినిమా షూటింగ్ చేస్తున్న శ్రీనివాస్



లొడుకు పాండి సినిమా షూటింగ్‌లో..

గంజాయి విక్రయిస్తున్న మహిళల అరెస్ట్

- 5.7 కేజీల గంజాయి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ కృష్ణమోహన్



వివరాలను మీడియాకు వెల్లడిస్తున్న డీఎస్పీ కృష్ణమోహన్, తదితరులు

రాయచోటిటౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు చేస్తున్న ఐదుగురు మహిళలను అరెస్టు చేసి వారి నుంచి 5.7 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ కృష్ణమోహన్ తెలిపారు.. సోమవారం రాయచోటి అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఆయన మీడియాకు వెల్లడించారు. గత నెల 26న రాయచోటి పట్టణంలోని నాయబ్‌సాబ్ వీధికి చెందిన షేక్.జమాల్ బాషా అలియాస్ జమాలుల్లాను అరెస్టు చేసి అతనినుంచి 1200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. ఆ కేసులో నిందితులుగా ఉన్న షేక్. మహబూబ్‌జాన్, షేక్. అమ్మాజీ, షేక్.ఫక్రున్నీసాతోపాటు, అనంతపురం పట్టణం ఇందిరానగర్‌కు చెందిన రహమత్‌జాన్, షేక్ సోనూను స్థానిక బండ్లపెంట దివానా సాహెబ్ దర్గా సమీపంలో అరెస్టు చేసి వారి నుంచి 5.7 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని వివరించారు. నిందితుల్లో షేక్ మహబూబ్‌జాన్, రహమత్‌జాన్ అలియాస్ హాజీ రహంతుల్లా ఒక తల్లి పిల్లలని తెలిపారు. షేక్.రహమత్‌జాన్ ఆమె కుమార్తె సోనూ కాకినాడ జిల్లా సామర్లకోట నుంచి కిలో రూ.13 వేలతో కొనుగోలు చేసి గంజాయి తెప్పిం చుకొని ఒక కేజీ గంజాయి రూ.13 వేలు చొప్పున కొనుగోలు చేసి మిగిలిన వారికి రూ.15 వేలకు విక్రయించేవారని తెలిపారు. నిందితు లను అరెస్టు చేయడంతో పాటు, గంజాయిని రికవరీ చేయడంలో చొరవ చూపిన రాయచోటి అర్బన్ సీఐ చంద్రశేఖర్, ఎస్ఐలు నరసింహారెడ్డి, అబ్దుల్‌జహీర్, పోలీసు సిబ్బంది రామచంద్ర, బర్కతుల్లా, మహేంద్ర నాయుడు, పెంచలయ్య, మహేంద్ర, టెక్నికల్ ఇన్‌చార్జి రవిని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు అభినందించారని తెలిపారు.

ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ యాప్‌లో సమగ్ర సమాచారాన్ని పొందుపర్చాలి : పీడీ



జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మెప్మా పీడీ సురేశ్‌రెడ్డి

రాయచోటిటౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఎస్‌హెచ్‌జీ ప్రొఫైల్ యాప్‌లో పొందుపర్చాలని మెప్మా పీడీ సురేశ్‌రెడ్డి సూచించారు. సోమవారం పట్టణంలోని వాసవీ కల్యాణ మండపంలో రాజంపేట, మదనపల్లె, రాయచోటి పురపాలక సంఘాల్లో పనిచేస్తున్న మెప్మా సిబ్బందికి, రీసోర్స్‌పర్సన్ లకు ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ యాప్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాల అప్పులు, పొదుపు వివరాలతో పాటు స్వయం సహాయక సంఘాల సభ్యులకు సంబంధించిన ప్రాథమిక, సాంఘిక, ఆర్థిక వాస్తవిక సమాచారాన్ని అందులో పొందుపరుస్తారన్నారు. మహిళా సంఘాల సభ్యులు పేదరికం నుంచి బయటపడేలా ఆర్థిక ప్రణాళికలను తయారు చేసేందుకు ఈ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రతి నెల మహిళా సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులను అమ్ముకొనుటకు అవకాశం కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో టీఈలు, సీఎంఎంఎస్‌లు, సీవోలు, డీఈవో, డీఆర్పీ, టీఎల్ఎఫ్ ఆర్పీలు, ఎస్ఎల్ఎఫ్ ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొనడంతో వ్యక్తి మృతి



మృతుడు కోళ్ల రెడ్డెప్ప

కలికిరి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కారు నడపడంలో అతి వేగం, పూర్తి అజాగ్రత్త, రాంగ్ రూట్ డ్రైవింగ్ కారణంగా ఒక వ్యక్తి మృత్యువు పాలయ్యాడు. మండలంలోని మర్రికుంటపల్లె పంచాయతీ కొత్తగజ్జలవారి పల్లె సమీపంలో సోమవారం తెల్లవారు జామున ఈ ప్రమాదం జరిగింది. కలికిరి పోలీసు ఇన్‌స్పెక్టరు కె.రెడ్డిశేఖర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం వాల్మీకిపురం గండబోయన పల్లె పంచాయతీ కొండకింద మేకలవారిపల్లె గ్రామానికి చెందిన కోళ్ళ రెడ్డెప్ప (40) ఆవుల కొనుగోలు నిమిత్తం ద్విచక్ర వాహనంలో స్వగ్రామం నుంచి కలకడకు బయలుదేరాడు. వేకువ జామున 4.15 గంటల ప్రాంతంలో మండలంలోని కొత్తగజ్జలవారిపల్లె సమీపం లోకి రాగానే ఎదురుగా కలకడ వైపు నుంచి వస్తున్న ఫోర్డ్ ఫియాగో కారు అతి వేగంగా రెడ్డెప్ప మోటారు సైకిలును ఢీకొట్టింది. దీంతో రెడ్డెప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. కారు డ్రైవరు పూర్తి అజాగ్రత్తగా, రాంగ్ సైడ్ వేగంగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడని సీఐ వివరించారు. సుండుపల్లెకు చెందిన రవీంద్ర నాయుడు ఈ కారును నడుపుతు న్నట్లు గుర్తించామని తెలిపారు. సమాచారం అందిన వెంటనే మృతుని భార్య కోళ్ల మమత బంధువులతో కలిసి రెడ్డెప్పను కలికిరి ప్రభుత్వ ఆసుపత్రికి చేర్చగా అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడు రెడ్డెప్పకు భార్య, ఇద్దరు పిల్లలు న్నారు. సీఐ ఆదేశాలపై హెడ్ కానిస్టేబుల్ రాజేంద్రప్రసాద్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చేపలవేటకు వెళ్లి వ్యక్తి మృతి



మృతి చెందిన చిన్నరాముడు

నిమ్మనపల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రామ సమీపంలోని చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లిన ఓ వ్యక్తి నీటిలో మునిగి మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలో చోటు చేసుకొంది. పోలీసుల కథనం మేరకు మండలంలోని రాచవేటివారిపల్లి పంచాయతి ఎగువమాచిరెడ్డిగారిపల్లికి చెందిన తుపాకుల చిన్నరాముడు(45)గ్రామ సమీపంలోని పెద్దచెరువు వద్ద చేపలు పట్టేందుకు వెళ్లాడు, ఈ క్రమంలో చెరువు లోతు ఎక్కువగా ఉండడంతో ఈత రాక నీటిలో మునిపోయాడు. అక్కడే వున్న గ్రామస్థులు రాముడు నీటిలో మునిగిపోవడం గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే స్థానికులు చెరువులోకి దూకి కాపాడే ప్రయత్నం చేయగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. దీంతో మృతుడు భార్య జయమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు.

యూటీఎఫ్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

- అధ్యక్ష, కార్యదర్శులుగా హరిప్రసాద్, జాబీర్‌లు



అధ్యక్ష, కార్యదర్శులు సుధాకర్‌నాయుడు, జాబీర్, హరిప్రసాద్

మదనపల్లె అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ జిల్లా నూతన కమిటీని స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీపతిరాజా ఆధ్వర్యంలో సోమవారం ఎన్నుకున్నారు. ఇందులో గౌర వాధ్యక్షుడిగా సుధాకర్‌నాయుడు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా హరిప్రసాద్, జాబీర్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎస్. శివారెడ్డి, అసోసియేట్ మహిళా ప్రెసిడెంట్ కె.హేమ లత, ట్రెజరర్ బి.చంద్రశేఖర్‌తో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. జిల్లాకు పదిమంది కార్యదర్శులను మిగతా సభ్యులను ఎన్నిక య్యారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పురం వెంకటరమణ, సురేంద్రరెడ్డి, రమణ మూర్తి, ఆదినారాయణ, భాస్కర్‌రెడ్డి, సుధా కర్, తదితరులు పాల్గొన్నారు.

భవనంపై నుంచి కింద పడి కార్మికుడి మృతి

పీలేరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఇంటి నిర్మాణం చేస్తున్న ఓ భవని నిర్మాణ కూలీ మూడవ అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు కింద పడి మరణించిన సంఘటన సోమవారం పీలేరులో జరిగింది. పీలేరు పట్టణం మోడల్ కాలనీకి చెందిన పి.ఇబ్రహీం(48) స్థానికంగా భవన నిర్మాణ రంగ కూలీగా జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం స్థానిక సైనిక్ నగర్ ప్రాంతంలో పనికి వెళ్లాడు. మూడవ అంతస్థులో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. ఈ విషయాన్ని గుర్తించిన సహచర కార్మికులు అతనిని హుటాహుటిన పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందిన ట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై పీలేరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కడప పే అండ్ అకౌంట్స్ ఆఫీసర్‌గా శ్రీనివాసులు

కలికిరి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా పే అండ్ అకౌంట్స్ ఆఫీసర్‌గా డి. శ్రీని వాసులును నియమిస్తూ ప్రభుత్వం సోమ వారం ఆదేశాలు జారీ చేసింది. విజయవాడ పే అండ్ అకౌంట్స్ కార్యాలయంలో టెక్నికల్ మేనేజరుగా పనిచేస్తున్న శ్రీనివాసులుకు పీఏవోగా పదోన్నతి కల్పించి ఖాళీగా వున్న కడపలో నియమించారు. ఈయనతో పాటు మరో ముగ్గురికి కూడా పదోన్నతి లభించింది. ఈ మేరకు రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఉచిత సిలిండర్లపై గందరగోళం!



- మొదటి సిలిండరు తీసుకోవడానికి మార్చి వరకూ గడువు
- పురుషుల పేరుతో గ్యాస్ కనెక్షన్ ఉన్నా అర్హులే
- కుటుంబంలో ఒక్క కనెక్షన్‌కు మాత్రమే అర్హత
- కేవైసీ మాత్రం తప్పనిసరి

కలికిరి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రకటించిన ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం అమలుపై లబ్ధిదారుల్లో అనేక అపోహలు నెలకొన్నాయి. ఉచిత సిలిండర్ల మంజూరుకు ప్రభుత్వం విధించిన నిబంధనలు చిన్నపాటివే అయినా లబ్ధిదారుల్లో గందరగోళం నెలకొంది. వీరి అనుమానాల నివృత్తికి అధికారుల వైపు నుంచి ఎలాంటి ప్రయత్నాలు లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఉచిత సిలిండర్ల కోసం బుకింగులు మొదలై ఐదు రోజులు కావస్తున్నా ఈ పథకానికి తాము అర్హులో కాదో అనే విషయంలో కూడా స్పష్టత లేదు. దీనికి తోడు దీపం-1 పథకం లబ్ధిదారులకు మాత్రమే కొత్త పథకం వర్తిస్తుందనే ప్రచారం జరుగుతోంది. అంతేగాకుండా మహిళల పేరుతో గ్యాస్ కనెక్షన్ ఉంటేనే ఉచిత సిలిం డర్లు అందుతాయనే అపోహలు కూడా నెలకొ న్నాయి. ఇంకో వైపు కేవైసీ తప్పనిసరి అన్న విషయం తెలిసినా, దీన్ని ఎక్కడ చేసుకోవాలో తెలియక చాలా మంది అయోమయంలో ఉన్నారు. గతంలో దీపం పథకం ద్వారా కేవలం మహిళలకు మాత్రమే గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేశారు. ఇప్పుడు తాజా పథకానికి దీపం-2 అనే పేరు పెట్టడంతో ఇది కూడా మహిళలకే పరిమితమనే ప్రచారం జరుగు తోంది. మరో వైపు కేంద్రం గతంలో ఉజ్వల పథకం కింద కూడా పేద మహిళలకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేసింది. ఇవన్నీ ఒక ఎత్తయితే మరో వైపు పేదలందరికీ ఉచిత సిలిండర్లు ఇవ్వకుండా ప్రభుత్వం మాట తప్పిందని ప్రతి పక్షాలు ప్రచారం మొదలెట్టాయి. గత వైసీపీ ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాల్లో లబ్ధిదారుల అర్హతకు సంబంధించి ఆరేడు నిబంధనలు అమలు చేసింది. దీంతో అర్హత ఉన్నా చాలా మంది పేదలకు ఇప్పటికీ రేషన్ కార్డులు లేవు. రేషన్ కార్డు ఉంటే చాలు.. ఉచిత సిలిండర్లకు అర్హు లైనట్టేనని మరో వైపు అధికారులు చెబుతు న్నారు. వాస్తవానికి ఈ కోవలో అయితే చాలా మందికి ఉచిత సిలిండర్లు దక్కే పరిస్థితి లేదు. సడలించిన నిబంధనలతో కొత్త రేషన్ కార్డులు జారీ అయితేగానీ దీనికి పరిష్కారం లభించదు. మరో వైపు జనవరిలో కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయనున్నట్లు ప్రభుత్వం తాజాగా ప్రకటించింది.

కేవైసీ ఎక్కడ చేయించుకోవాలి..?

ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంటు, రేషన్ కార్డు, గ్యాస్ కనెక్షను మంజూరు.. ఇలా నాలుగు ఉంటేనే ఉచిత సిలిండర్లకు అర్హ తగా ప్రభుత్వం పేర్కొంది. ఈ నాలుగూ ఉన్నా చివరికి కేవైసీ తప్పనిసరి అంటు న్నారు. కేవైసీ అంటే నో యువర్ కస్టమర్ అని అర్థం. ఇక్కడ ఉచిత సిలిండర్ల లబ్ధిదా రులు మూడు స్థాయిల్లో కేవైసీకి ప్రయత్నిం చాల్సి ఉంటుందని ప్రచారం జరుగుతోంది. అయితే కేవైసీ అంటే ఎక్కడ చేసుకోవాలి? అకౌంటుకు సంబంధించి బ్యాంకులోనా, రేష న్ కార్డుకు సంబంధించి చౌక దుకాణం లోనా, గ్యాస్ కనెక్షనుకు సంబంధించి గ్యాస్ డీలరు వద్దనా, ఆధార్ కార్డుకు సంబంధించి ఆధార్ సవరణ కేంద్రంలోనా.. అనే అంశా లపై లబ్ధిదారులకు స్పష్టత ఇచ్చేవారు కరు వయ్యారు. దీనికి సంబంధించి అధికారులు కూడా సూటిగా చెప్పలేకపోతున్నారు. ఈ అంశాలు కూడా ప్రజల్లో గందరగోళానికి కారణమవుతున్నాయి.

డాక్యుమెంట్లు సమర్పించాలన్న మరో పీటముడి

కేవైసీపై గురించే లబ్ధిదారుల్లో గందరగోళం ఉండగా.. సిలిండరు బుక్ చేసుకునే సమ యంలో ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ పాసు పుస్తకం, రేషన్ కార్డు, గ్యాస్ కనెక్షన్ మంజూరు పత్రం అప్‌లోడ్ చేయాలని చెపు తున్నారని లబ్ధిదారులంటున్నారు. దీని కోసం ఇంటర్నెట్ కేంద్రాలకు వెళితే వందల్లో రుసుము వసూలు చేస్తారని, అన్నీ లెక్కిస్తే ఉచిత సిలిండర్ ధరకు సరిపోతుందనే విమ ర్శలున్నాయి. అలా కాకుండా అర్హులైన వారికి శాశ్వతంగా గుర్తింపు కార్డులు జారీ చేస్తే సరి పోతుంది కదా అని సూచిస్తున్నారు.

ఉచిత సిలిండర్‌కు అర్హులెవరంటే..

ఉచిత గ్యాస్ సిలిండర్ల కోసం అర్హులెవరనే దాని పైన అధికారులు ఇప్పుడిప్పుడే వివర ణలు ఇస్తున్నారు. కుటుంబంలోని పురుషుల పేరుతో గ్యాస్ కనెక్షన్ ఉన్నాగానీ ఉచిత పథ కానికి అర్హులుగానే చెపుతున్నారు. ఒక వేళ భార్య పేరుతో రేషన్ కార్డు ఉండి భర్త పేరుతో గ్యాస్ కనెక్షన్ ఉన్నా అర్హులవుతారు. కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకుంటున్న కార ణంగా ఒక రేషన్ కార్డుకు ఒక గ్యాస్ కనెక్షన్ కు మాత్రమే అర్హత ఉంటుంది. ఉచిత సిలిం డర్ల కోసమైతే ఆధార్, బ్యాంకు ఖాతా, రేషన్ కార్డు, గ్యాస్ కనెక్షను మంజూరు తప్పనిసరి. బ్యాంకు ఖాతాకు, రేషన్ కార్డుకు, గ్యాస్ కనెక్ష న్‌కు ఆధార్ తప్పనిసరిగా అనుసంధానమై ఉండాలి. అదనంగా మొబైల్ నంబరు కూడా కలిగి ఉండాలి. గ్యాస్ కనెక్షన్ మంజూరయిన వ్యక్తి ఆ కుటుంబ రేషన్ కార్డులో తప్పనిస రిగా ఉండాలి. ఒకే రేషన్ కార్డులోని ఇద్దరు ముగ్గురు పేరుతో గ్యాస్ కనెక్షన్‌లుంటే ఉచిత సిలిండర్ పథకం మాత్రం ఒకరికే వర్తిస్తుంది. ఇందులో ఏ కనెక్షన్‌కు ప్రాధాన్యమిస్తారన్న విషయంలో స్పష్టత రావలసి ఉంది. పాతికేళ్ల క్రితం అప్పట్లో టీడీపీ ప్రభుత్వం దీపం పథకం పేరుతో ఇచ్చిన ఉచిత గ్యాస్ కనెక్ష న్లతో పాటు కేంద్రం మంజూరు చేసిన ఉజ్వల పథకానికి కూడా దీపం-2 (ఉచిత సిలిండర్ పథకం) వర్తిస్తుంది. గ్యాస్ బుకింగ్ ఆన్‌లైన్ లో లేదా డీలర్ వద్ద చేసుకోవచ్చుగానీ వాటికి అవసరమైన డాక్యుమెంట్ల విషయంలో ఎవ రికీ స్పష్టత లేదు. సిలిండర్‌కు డెలివరీ సమ యంలో నగదు చెల్లించిన అనంతరం గ్యాస్ కంపెనీ నుంచి రెండు రోజుల్లో ఆ డబ్బు తిరిగి లబ్ధిదారుల ఖాతాల్లో జమవుతుంది. అవసరమైన అన్ని లాంఛనాలు పూర్తి చేసు కుని పథకం ప్రారంభించి ఉంటే బాగుండేదనే విమర్శలున్నా మొదటి సిలిండర్ పొందడానికి ఐదు నెలలు (వచ్చే ఏడాది మార్చి వరకూ) గడువు ఉన్నందువల్ల తొందరపడాల్సిన అవ సరం లేదని అధికారులు సర్దిచెపుతున్నారు. ఇందులో ఏమైనా సందేహాలుంటే నివృత్తి కోసం 1967 టోల్ ఫ్రీ నంబరును సంప్రదించ వచ్చని అధికారులు పేర్కొంటున్నారు.

ట్రిపుల్ఐటీలో క్యాంటీన్ల మూత

- బయట ఫుడ్ కోసం ఆర్డర్లు
- యాజమాన్యం, సెక్యూరిటీ సిబ్బంది అభ్యంతరం
- నిరసనకు దిగుతున్న విద్యార్థులు

వేంపల్లె, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్ఐటీలో విద్యార్థులు బయట ఫుడ్ కోసం ఎగబడుతున్నారు. వేంపల్లెలో ఆర్డర్ చేసుకొని రాత్రి 10, 11 గంటలకు కూడా బయటి ఫుడ్ తీసుకుంటుండడంతో ట్రిపుల్ఐటీ యాజమాన్యం, సెక్యూరిటీ సిబ్బంది అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. దీంతో మాకు బయటి ఫుడ్ కావాలంటూ విద్యార్థులు ఆది, సోమవారాల్లో రాత్రిపూట కొంతసేపు నిరసన తెలిపారు. ఇడుపులపాయ ట్రిపుల్ఐటీలో ఉన్న ఐదు క్యాంటీన్లు గత నెలలో రద్దు చేయడంతో మూతపడ్డాయి. ఆ క్యాంటీన్లు ఉన్న సమయంలో మెస్లో తినని విద్యార్థులు క్యాంటీన్లకు వెళ్లితినేవారు. ప్రస్తుతం మూతపడడంతో బయట ఫుడ్ ఆర్డర్ చేస్తూ ట్రిపుల్ ఐటీకి తెప్పించుకుంటున్నారు. రాత్రి 11 వరకు తెప్పించుకుంటుండడంతో ట్రిపుల్ఐటీ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. 8 లోపు తెప్పించుకోవాలని సూచించడంతో అప్పటికే ఆర్డర్లు ఇవ్వడం వల్ల బయటిఫుడ్ మాకు ఇవ్వాల్సిందేనని నిరసన తెలిపారు. అప్పటికి సర్దిచెప్పి ఫుడ్ను ఇప్పించి పంపించారు. రోజు రాత్రివేళల్లో ఇదే పరిస్థితి తలెత్తుతోంది. ట్రిపుల్ఐటీలో వెంటనే క్యాంటీన్లను ఏర్పాటుచేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసర ఎంతైనా ఉంది. ఈ విషయాన్ని డైరెక్టర్ కుమారస్వామి గుప్త దృష్టికి తీసుకెళ్లగా క్యాంటీన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, త్వరలోనే ఏర్పాటవుతాయని తెలిపారు. అప్పటి వరకు విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు.

మెస్లలో సక్రమంగా ఉండడం లేదా...

ట్రిపుల్ఐటీలో చదువుతున్న విద్యార్థులు మెస్సుల్లో తినకుండా క్యాంటీన్లకు ఎగబడడం, అవి లేకపోవడంతో బయటినుంచి ఫుడ్ తెప్పించుకుంటుండడంతో మెస్లలో ఫుడ్ సక్రమంగా ఉండడం లేదా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మెస్సులపై ఫిర్యాదులు రావడంతో ఇప్పటికే రద్దు చేశారు. వాటినే తాత్కాలికంగా కొనసాగిస్తున్నారు. కొత్తగా టెండర్లు పిలిచేందుకు ఆర్జీయూకేటీ సిద్ధమవుతోంది. మెస్లలో నాణ్యమైన ఆహారం అందిస్తే విద్యార్థులు క్యాంటీన్ల వైపు మొగ్గుచూపరు కదా అనే ప్రశ్న తలెత్తుతోంది. ఆ విధంగా ట్రిపుల్ఐటీ యాజమాన్యం విద్యార్థులకు మంచి ఆహా రం అందించేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైన ఉంది.



ప్రశాంతంగా ముగిసిన గెస్ట్ఫ్యాకల్టీ ఇంటర్వ్యూలు



కడప(ఎడ్యుకేషన్), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వైవీయూ పీజీ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీ ఇంటర్వ్యూలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. పీజీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసరు రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఇంటర్వ్యూలో వైస్చాన్సలర్ కె.క్రిష్ణారెడ్డి, ప్రొఫెసరు దాము, సబ్జెక్టు ఎక్స్పర్ట్ కర్నూలు రాయలసీమ యూనివర్శిటీ ప్రొఫెసరు విశ్వనాథరెడ్డి, వెంకటేశ్వర యూనివర్శిటీ ప్రొఫెసరు శ్రీదేవి, ప్రొఫెసరు విజయభారతి, డాక్టర్ శ్రీధర్బాబు, డాక్టర్ రమణ, సుభాష్చంద్ర, డాక్టరు శ్రీనివాసరావు ఇంటర్వ్యూల నిర్వహణలో పాల్గొన్నారు. ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి మాట్లాడుతూ ఇంటర్వ్యూలు ప్రశాంతంగా ముగిశాయని.. ప్రతిభతో పాటు పీహెచ్డీ, నెట్ అర్హత ఉన్న వారికి ఎంపికల్లో ప్రాధాన్యత ఇస్తామన్నారు.

భార్య ఆత్మహత్యకు కారణమైన భర్త అరెస్టు

కడప క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కడపనగరం కాగితాల పెంటకు చెందిన ఫిర్దోస్ అనే మహిళ భర్త వేధింపులు తాళలేక ఆదివారం ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె ఆత్మహత్యకు కారణమైన భర్త కరీముల్లాను సోమవారం సాయంత్రం అరెస్టు చేసినట్లు తాలుకా సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. 17సంవత్సరాల క్రితం ఫిర్దోస్ను కరీముల్లా పెళ్లి చేసుకన్నాడు. గత కొంతకాలంగా భార్యను శారీరక మానసికంగా వేధింపులకు గురిచేయడంతో ఆమె ఆత్మహత్యకు పాల్పడింది. ఈ మేరకు నిందితుడు కరీముల్లాను అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

'ఎస్ఐ చితక్కొట్టాడు'

కడప క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తన స్థలంలో మట్టి పోస్తుండగా ఇరువురు కానిస్టేబుళ్లు వచ్చి తనను పోలీసుస్టేషన్కు తీసుకెళ్లారని.. తనను చూసిన వెంటనే ఎస్ఐ చితక్కొట్టాడంటూ బాధితుడు జయశంకర్ వాపోయాడు. బాధితుడి వివరాల మేరకు...

పెండ్లిమర్రి మండలం నందిమండలం బస్టాండు వద్ద 18ఏళ్లక్రితం స్థలం కొనుగోలు చేశామని.. అయితే తమ స్థలం పక్కనే నాగేంద్రకు చెందిన స్థలం ఉందన్నారు. ఆదివారం నా స్థలంలో మట్టి వేసుకుంటుండగా నాగేంద్ర పోలీసులకు ఫిర్యా దు చేశాడు. ఈ మేరకు కానిస్టేబుల్ వచ్చి తనను తీసుకెళ్లగా.. ఎస్ఐ విచక్షణారహితంగా దాడి చేసి గాయపరిచాడన్నారు. పేపర్లు పరిశీలించాలని కోరినా వినిపించుకోలేదన్నారు. ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై పెండ్లిమర్రి ఎస్ఐ మధుసూదనరెడ్డిని వివరణ కోరగా.. నాగేంద్ర ఇంటి పక్కన ఉన్న స్థలంలో మట్టిపోయయడంతో తమకు ఫిర్యాదు చేశాడన్నారు. అతన్ని పిలిపించి స్థలం వద్ద గొడవ పడకూడదని.. ఏదైనా ఉంటే తహసీల్దారుకు ఆ స్థలం వివరాలు ఇవ్వాలని కోరుతామని చెప్పి పంపించామే తప్ప అతనిపై ఎలాంటి దాడి చేయలేదన్నారు.

సీఎంపై అసభ్య పోస్టింగులు.. ఇరువురిపై కేసు

కడప క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, మంత్రి లోకేశ్పై సోషల్ మీడియాలో అసభ్య పోస్టింగులు పెట్టిన ఇరువురిపై చిన్నచౌకు పోలీసులు కేసు నమోదు చేశారు. కడపకు చెందిన శ్రీనివాసులు మరో వ్యక్తి కలిసి సామాజిక మాధ్యమాల్లో సీఎం చంద్రబాబు, లోకేశ్లపై పోస్టింగులు చేశారు. దీంతో టీడీపీనేత తిరుమలేశు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆ ఇరువురిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు

రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి

కడప క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కడప నగరం నమస్తేబోర్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కిశోర్ (16) అనే బాలుడు మృతి చెందాడు. వన్టౌన్ ఎస్ఐ అమర్నాథరెడ్డి తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు శంకరాపురానికి చెందిన కిశోర్ స్కూటీలో వెళుతుండగా మరో వాహనం వచ్చి ఢీకొట్టడంతోతీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం రిమ్స్కు తరలించగా మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు.

బాలుడు అదృశ్యం

కడప క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కడప నగరం మృత్యుంజయకుంట చెందిన మణికంఠ అనే బాలుడు అదృశ్యమైనట్లు చిన్నచౌకు ఎస్ఐ రాజరాజేశ్వర్రెడ్డి తెలిపారు. ఆయన వివరాల మేరకు.. మణికంఠ మరో నలుగురు స్నేహితులతో కలిసి ఆదివారం ఉదయం ఇంటి నుంచి బయటికి వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో సోమవారం బాలుడి తండ్రి ఓబులరాయుడు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు. కాగా మణికంఠతో పాటు వెళ్లిన పిల్లలను విచారించగా చెన్నూరు సమీపంలోని పెన్నానదిలో ఈతకు వెళ్లగా మణికంఠ నీటి లో మునిగిపోయి గల్లంతైనట్లు అధికారుల దృష్టికి తీసకువచ్చారు. మణికంఠ నగరంలోని ప్రైవేటు స్కూలులో 8వ తరగతి చదువుతున్నాడు. గల్లంతైన మణికంఠ కోసం పోలీసులు గాలిం పు చర్యలు చేపట్టనున్నారు.

యువతి అదృశ్యం

కడప క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కడప నగరం తాలుకా పోలీసుస్టేషన్ పరిధిలోని ఇక్బాల్ రైస్మిల్లు సమీపంలో యువతి సోమవారం అదృశ్యమైనట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. తేజస్విని ఇంటర్ పూర్తి చేసి డాక్టరు కోర్సు కోసం ఇంట్లో ఉండి చదువుకుంటోంది. ఉదయం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో యువతి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

ఓవరాల్ చాంపియన్ కడప జట్టు



ఓవరాల్ చాంపియన్షిప్ కైవసం చేసుకున్న కడప జిల్లా జట్టు

శ్రీకాకుళం స్పోర్ట్స్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక కోడి రామ్మూర్తి స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్ జిల్లాల అథ్లెటిక్స్ బాలబాలికల పోటీల ఓవరాల్ చాంపియన్గా కడప జిల్లా నిలిచింది. మొత్తం 11 బంగారు, నాలుగు రజిత, ఒక కాంస్య పతకంతో సత్తాచాటారు. గత రెండు రోజులుగా జరుగుతున్న ఈ పోటీలు సోమవారంతో ముగిసాయి. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. విశాఖ జిల్లా ఐదు బంగారు, 10 రజిత, ఐదు కాంస్య పతకాలతో ద్వితీయస్థానంలో నిలిచింది. తూర్పుగోదావరి జిల్లా ఐదు బంగారు, ఒక రజిత, ఐదు కాంస్య పతకాలతో తర్వాత స్థానంలో నిలిచింది. అదేవిధంగా శ్రీకాకుళం ఒక బంగారు, నాలుగు రజిత, మూడు కాంస్య పతకాలు సాధించగా, పశ్చిమ గోదావరి జిల్లా నాలుగు బంగారు, రెండు రజిత, మూడు కాంస్య పతకాలు, గుంటూరు జిల్లా మూడు బంగారు, నాలుగు రజిత, మూడు కాంస్య పతకాలు, కృష్ణ జిల్లా ఒక బంగారు, మూడు రజిత, రెండు కాంస్య పతకాలు సాధించాయి. ప్రకాశం జిల్లాకు చెరో బంగారు, కాంస్య పతకాలు, కర్నూలు జిల్లాకు మూడు బంగారు, రెండేసి రజిత, కాంస్య పతకాలు వచ్చాయి. అనంతపురం జిల్లా చెరో బంగా, రజిత, మూడు కాంస్య పతకాలు సాధించగా, నెల్లూరు ఒక రజితం, రెండు కాంస్య పతకాలు, చిత్తూరు జిల్లాకు ఒక కాంస్య పతకం వచ్చింది. ఇందులో మెరిట్ ఉన్నవారికి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధిస్తారని నిర్వాహకులు, ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి బీవీ రమణ తెలిపారు.

'అ'.. ఆయనా..!

- నీటిపారుదలశాఖలో హల్చల్
- లోకేశ్ ఫ్రెండ్ అంటూ ప్రచారం
- చక్రాయపేటలో ఇల్లు కూల్చారనే నెపంతో..
- ఈఈని బాధ్యతలు చేపట్టనివ్వని వైనం

(కడప-ఆంధ్రజ్యోతి): కడప ఎమ్మెల్యే కార్యాలయంలో చిన్న పనికావాలన్నా.. నీటిపారుదలశాఖ కార్యాలయంలో వాచ్మాన్ తలుపు తెరవాలన్నా ఒకాయన పేరే వినిపిస్తుంది. ఆయనే 'అ' అనే అక్షరంతో మొదలయ్యే పేరున్న వ్యక్తి. మొన్నటి వరకు కనీసం అడ్రస్ లేని వ్యక్తి ఇప్పుడు కడపలో ప్రముఖమైన వ్యక్తిగా మారాడంటారు. ఉద్యోగం కావాలన్నా, బదిలీ కావాలన్నా, ఏదైనా పదవి కావాలన్నా.. ఆఖరుకు ఏదైనా సిఫారసు అయినా సరే.. శివుడి ఆజ్ఞ లేకుండా చీమ ఎలా కుట్టదంటారో అలా.. 'అ' ఆజ్ఞ లేనిదే అటు పాలిటిక్స్, ఇటు అధికార యంత్రాగంలో పని జరగదంటారు. ఎలా అంటే ఈయన మంత్రి నారాలోకేశ్, సీఎం చంద్రబాబు పేరు చెప్పుకోవడంతో పాటు కడప ముఖ్య నేత అనుచరుడని చెప్పుకుంటూ ముఖ్యంగా నీటిపారుదలశాఖలో హవా కొనసాగిస్తున్నారు. ఒక ఇన్చార్జి ఈఈని బాధ్యతలు చేపట్టనివ్వకుండా అడ్డుకున్నాడంటే 'అ' పవరేమిటో అర్థమవుతుంది.

ఈఈని అడ్డుకున్నారు

ఆయనకు ఉండే బ్యాక్గ్రౌండ్ ఏందంటే టీడీపీ కేడరుగా ఉంటూ లోకేశ్ పాదయాత్రలో పాల్గొనడం. దీనికి తోడు ఇప్పుడు కడపను ఏలుతున్న ముఖ్య నేత సామాజిక వర్గం కావడంతో ఆయన ఆగడాలకు అడ్డులేకుండా పోయింది. వామ్మో.. వైసీపీ నేతలే మేలన్న స్థితికి ఈయన తీసుకువచ్చారు. కడప మైనర్ ఇరిగేషన్ ఈఈ బాల చంద్రారెడ్డి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో అన్నమయ్య డివిజనులో పనిచేస్తున్న మురళీక్రిష్ణ ఈఈగా వచ్చారు. ఆయన బాధ్యతలు చేపట్టేందుకు వెళ్లగా చక్రాయపేటకు చెందిన కడపలో రుబాబు చేస్తున్న 'అ' అనే వ్యక్తి అడ్డుకున్నట్లు చెబుతారు.

చెరువులో కట్టారని..

చక్రాయపేట మండలంలోని ఓ చెరువులో అక్రమ కట్టడాలు అంటూ 2019లో జగన్ ప్రభుత్వం 'అ' ఇంటిని కూల్చింది. అప్పట్లో జగన్ కుటుంబీకులు చెప్పిందే వేదం. రాష్ట్రానికి జగన్ సీఎంగా ఉన్నప్పటికీ జిల్లాకు అంతా పులివెందుల నేతలే సుప్రీంగా వ్యవహరించారు. ముఖ్యంగా చక్రాయపేటకు కొండారెడ్డి చెప్పిందే ఆజ్ఞ అంటారు. అప్పట్లో పై నుంచి వచ్చిన ఆదేశాలు, రెవెన్యూ అధికారుల రిపోర్టు మేరకు 'అ' ఇల్లు కూలగొట్టారు. అనంతరం టీడీపీ అధికారంలోకి రావడంతో.. తన ఇంటిని కూలగొట్టిన ఇరిగేషన్ అధికారులపై ఆయన పగబట్టినట్లు చెబుతారు. అప్పటి ప్రభుత్వ ఆదేశాల మేరకు 'అ' ఇంటిని కూలగొట్టిన టీంలో ఉన్న మురళీకృష్ణ ఇప్పుడు ఈఈగా రాగా విధుల్లో చేరనివ్వకుండా ఆయన అడ్డుకున్నారు. మీరు అప్పుడు ఇల్లు పగలగొట్టారు, నాకు నష్టపరిహారం ఇవ్వండి అంటూ ఇప్పటికీ ఇరిగేషన్ అధికారులను 'అ' డిమాండ్ చేస్తున్నారంటారు. టీడీపీకి చెందిన ముఖ్య నేత కూడా ఆయనతో మాట్లాడుకుని సెటిల్ చేసుకోవాలంటూ అధికారులకు సలహా ఇస్తుండడమే ఇప్పుడు చర్చగా మారింది.

గంగాధర్ గౌడ్ సేవలు అభినందనీయం



డీఆర్వో గంగాధర్ గౌడ్ను సన్మానిస్తున్న ఇన్చార్జి కలెక్టర్ అదితిసింగ్

కడప కలెక్టరేట్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్ సేవలు అభినందనీయమని ఇన్చార్జి కలెక్టర్ అదితిసింగ్ అన్నారు. డీఆర్వో బాపట్ల జిల్లాకు బదిలీ అయిన సందర్భంగా సోమవారం కలెక్టరేట్లో ఆయనకు అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా ఇన్చార్జి కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా రెవెన్యూ అధికారిగా విశేష సేవలు అందించి, అందరు ఉన్నతాధికారుల మన్ననలను పొందారన్నారు. ఆయన బదిలీపై వెళ్లడం బాధాకరమని, కానీ ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణమన్నారు. గంగాధర్గౌడ్ మాట్లాడుతూ జిల్లాలో దీర్ఘకాలం పని చేయడం అదృష్టమన్నారు. రెవెన్యూ అధికారులందరి సహకారంతో పనిచేయగలిగామన్నారు. బదిలీపై వెళుతున్న ఆయనను అధికారులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు ఆనంద్నాయక్, విజయకుమార్, నాగేశ్వరరావు, వెంకట్రామయ్య, వెంకట్రావు, ఆర్డీవోలు, రెవెన్యూ శాఖాధికారులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ఇద్దరు విద్యార్థులకు పాముకాటు



పాఠశాలలో పామును చంపిన దృశ్యం, పాముకాటుకు గురైన వర్షిణి, పల్లవి

కొండాపురం, నవ ంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలికల గురుకుల పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు పాముకాటుకు గురయ్యారు. ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ జ్యోతి వివరాల మేరకు సోమవారం తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో హాస్టల్ గదిలో నిద్రిస్తున్న మోటుపల్లి పల్లవి, కోగటం వర్షిణి అనే ఇద్దరు 8వ తరగతి విద్యార్థినులను పాము కాటేసింది. దీంతో ఏదో కుట్టిందని.. అక్కడే వారితోపాటు ఉన్న పీడీ కాటమ్మకు తెలియజేశారు. దీంతో పాఠశాలలోని హెల్త్సూపర్వైజర్తో చెకప్ చేయించారు. ఎలుకలు కరిచినట్లు అనుమానంతో ప్రాథమిక చికిత్స చేశారు. అనంతరం ప్రొద్దున్నే 6 గంటల ప్రాంతంలో డార్మెంటరీలో పిల్లలు బ్రష్ చేస్తుండగా పాము కనపడింది. దీంతో పామును సిబ్బంది సహాయంతో చంపేశారు. దీంతో విద్యార్థులకు పాము కుట్టి ఉండవచ్చునన్న అనుమానంతో వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. కాగా వర్షిణిని ప్రొద్దుటూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. ప్రిన్సిపాల్ కృష్ణవేణి విద్యార్థిని దగ్గరే ఉండి చికిత్స చేయిస్తున్నారు. కాగా పల్లవి అనే విద్యార్థిని ఆరోగ్యం మెరుగ్గా ఉండటంతో అబ్జర్వేషన్ నిమిత్తం కడప రిమ్స్కు తరలించారు. కాగా ప్రస్తుతం ఇద్దరు విద్యార్థుల ఆరోగ్యం మెరుగ్గా ఉందని ప్రిన్సిపాల్ తెలిపారు. విషయం తెలుసుకున్న జమ్మ లమడుగు ఆర్డీవో ఆదిమూలం సాయి శ్రీ గురుకుల పాఠశాలను సందర్శించారు. విషపురుగులు పాఠశాలలోకి రాకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. తహసీల్దార్ గురప్ప, ఎంపీడీవో నాగ ప్రసాద్, ఎంఈవోలు ఓబులేసు, రామయ్య తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలను పరిశీలిస్తున్న జమ్మలమడుగు ఆర్డీవో

ప్రారంభమైన సెమిస్టరు పరీక్షలు

కడప (ఎడ్యుకేషన్), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వైవీయూ పరిధిలో బీఈడీ కళాశాలల 2, 4 సెమిస్టరు పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లాలో ఈ పరీక్షలకు సంబంధించి 16 కేంద్రాలను ఏర్పాటు చేశారు. సోమవారం పరీక్షలను వైస్చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసరు క్రిష్ణారావు తనిఖీలు నిర్వహించారు. కడప నగరంలో ఎస్వీ బీఈడీ కళాశాల శ్రీహరి బీఈడీ కళాశాలల కేంద్రాలో విద్యార్థుల హాల్టికెట్లను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన వసతులు కల్పించాలని.. ఆహ్లాదకర వాతావరణంలో పరీక్షలు రాసే ఏర్పాట్లు చేయాలని సూచి ంచారు. ప్రతి కేంద్రం నుంచి అబ్జర్వర్లను ఏర్పాటు చేశామని హైపవర్ కమిటీ ప్రతినిధులు తనిఖీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. హైపవర్ కమిటీ సభ్యులు ప్రొఫెసరు సునీత, రియాజున్నీసా కేంద్రాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

పాపాఘ్నిలో ఇసుకను తోడేస్తున్నారు

- నది వద్ద రైతుల ధర్నా

వేంపల్లె, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం ప్రకటించడంతో వేంపల్లె పాపాఘ్ని నది నుంచి ఇసుకను విచ్చలవిడిగా తోడేస్తున్నారు. యథేచ్ఛగా వాహనాల్లో తరలుతున్న ఇసుకపై పాపాఘ్ని పరివాహక భూముల రైతులు ఆందోళనకు గురై సోమవారం నిరసనకు దిగారు. పాపాఘ్ని నదిలో ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను అడ్డగించి ధర్నా చేశారు. అక్కడే బైఠాయించారు. ఇసుక యథేచ్ఛగా తరలిపోతే భూగర్భజలాలు అడుగంటి ప్రజలకు తాగునీరు ఉండవని, నీళ్ల వచ్చిన పుడు భూములు కోతకు గురవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ విషయాన్ని స్థానిక పోలీసులు, తహశీల్దార్కు తెలియజేశారు. రైతులకు సీపీఐ నాయకులు మద్దతు తెలిపి ఆందోళన చేశారు. అక్కడున్న ట్రాక్టర్లను తహశీల్దార్ కార్యాలయానికి తరలించారు. ఇసుకను అవసరమైన వారు ఉచితంగా రీచ్లలో తెచ్చుకోవాలని, ఇతర అవసరాల కోసం వస్తే చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ హరినాథరెడ్డి వారిని హెచ్చరించి పంపించేశారు.



వేంపల్లె పాపాఘ్ని నది వద్ద ఇసుక ట్రాక్టర్లను అడ్డగించి నిరసన తెలుపుతున్నరైతులు

రిమ్స్లో ప్రతి మంగళ, శుక్రవారాల్లో అన్నదానం

- కందుల చంద్ర ఓబుళరెడ్డి



మాజీ ఎమ్మెల్యే కందుల శివానందరెడ్డికి నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు

సీకేదిన్నె, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కందుల శివానందరెడ్డి జ్ఞాపకార్థం ప్రతి మంగళ, శుక్రవారాల్లో రిమ్స్ ప్రభుత్వ ఆస్పత్రిలో అన్నదానం నిర్వహిస్తామని విద్యాసంస్థల ఎండీ కందుల చంద్ర ఓబుళరెడ్డి తెలిపారు. కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం కందుల శివానందరెడ్డి 4వ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించి రక్తదాన శిబిరం, భగవద్గీత పారాయణం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎప్సెట్ 2024 ద్వారా కేఎస్ఆర్ఎం కళాశాలలో మెరిటోరియస్ విద్యార్థులకు, కేజీసెట్ 23 స్కాలర్షిప్లు పొందిన విద్యార్థులకు స్కాలర్షిప్లు అందించడం, మొత్తం 38 మంది విద్యార్థులకు విద్యలో కొనసాగడానికి అవసరమైన సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. రిమ్స్లో సదరం సర్టిఫికెట్ల, అనారోగ్యంతో వచ్చే వారికి 350 మందికి అన్నదానం, మంచినీరు అందిస్తామన్నారు. వైస్చైర్మన్ మదన్మోహన్రెడ్డి మాట్లాడుతూ కందుల శివానంద రెడ్డి స్ఫూర్తి ప్రదాత అని, ప్రజలకు ఉచిత మంచినీటి సరఫరా, ఉచిత భోజ నం, విద్యార్థులకు స్కాలర్షిప్లు అందించిన మరుపురాని మనిషి అన్నారు. ప్రిన్సిపల్ వీఎస్ఎస్ మూర్తి మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్యతో ఉజ్వల భవిష్యత్తు అందిస్తామన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రాజేశ్వరమ్మ, చైర్మన్ రాజమోహన్రెడ్డి, వైస్ప్రిన్సిపల్ టీఎస్ప్రసాద్, కేఎల్ఎం ప్రిన్సిపల్ రత్నమ్మ, కేఎస్ఆర్ఎం మేనేజ్మెంట్ స్టడీ ప్రిన్సిపల్ నాగమణి, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడల ద్వారా కీర్తి ప్రతిష్టలు

పులివెందుల టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): క్రీడల ద్వారా ఎనలేని కీర్తి ప్రతిష్టలు ప్రతి క్రీడాకారుడు పొందుతాడని పశ్చిమ రాయలసీమ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి అన్నారు.పట్టణంలోని ధ్యాన్ చంద్ క్రీడా మైదానంలో కడప స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాఫ్ట్ టెన్నిస్ రాష్ట్ర స్థాయి క్రీడలు సోమవారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

'మీది రెడ్‌బుక్ అయితే మాది వైట్ బుక్'

కడప (ఎడ్యుకేషన్), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వానిది రెడ్ బుక్ అయితే తమది వైట్ బుక్ అని వైసీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్‌బాబు అన్నారు. సోమవారం వైసీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అమలు కాని హామీలను ఇచ్చి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు.



శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు



కడప:మృత్యుంజయకుంట శివాలయంలో స్వామివారి దర్శనం కోసం క్యూలో భక్తులు.. పుష్పగిరిలో సంతాన మల్లేశ్వరుడు.. చెన్నకేశవస్వామి



చెన్నూరు మల్లేశ్వరాలయంలో రుద్రహోమం...పల్లకీసేవ... పొలతలలో స్వామివారి ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

చెన్నూరు/పెండ్లిమర్రి/వల్లూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా జిల్లాలోని శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. ఆలయాల్లో భక్తులు తెల్లవారుజాము నుంచే స్వామిని దర్శించుకునేందుకు తరలివెళ్లారు. ప్రముఖ క్షేత్రాలైన పొలతల శ్రీమల్లేశ్వరస్వామి దేవస్థానం, పుష్పగిరిలో కొలువై ఉన్న శ్రీకామాక్షి సమేత వైద్యనాధేశ్వర చెన్నకేశవ ఆలయం తదితర దేవస్థానాల్లో ఘనంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి అభిషేకాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. కడప నగరం మృత్యుంజయకుంట శివాలయంలో ఎమ్మెల్యే మాధవి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద కార్యక్రమంలో పాల్గొన్నారు.

పారదర్శకంగా క్రీడా పోటీలను నిర్వహించాలి

లింగాల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఈనెల 14, 15, 16వ తేదీలలో జరిగే రాయలసీమ జోన్-4 క్రీడాపోటీలను పారదర్శకంగా నిర్వహించి విజయవంతం చేయాలని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్, గురుకుల పాఠశాల సమన్వయకర్త బ్రహ్మయ్య అన్నారు. సోమవారం ఇప్పట్ల గురుకుల పాఠశాలలో క్రీడాపోటీలపై అనంతపురం, కడప, చిత్తూరు, కర్నూలు జిల్లాల గురుకుల పాఠశాల పీఈటీలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాలికల ఇప్పట్ల గురుకుల పాఠశాలలో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, త్రోబాల్, చెస్, క్యారమ్స్ పోటీలను నిర్వహిస్తారన్నారు. అలాగే బాలురకు గండి క్షేత్రంలోని గురుకుల పాఠశాలలో వాలీబాల్, కబడ్డీ, చెస్, ఖోఖో,క్యారమ్స్ క్రీడలకు సంబంధించి పోటీలను నిర్వహిస్తారన్నారు. ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన జట్లకు పశ్చిమ గోదావరి జిల్లా పెదవేగిలో ఈనెల 28, 29, 30 తేదీలలో రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలను నిర్వహిస్తామని పేర్కొన్నారు.

చక్రాయపేటను కరువు మండలంగా ప్రకటించాలి

చక్రాయపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎంతో వెనుకబడిన ప్రాంతమైన చక్రాయపేటను కరువు మండలంగా ప్రకటించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రమైన చక్రాయపేటలో రైతులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలేటివాగు ప్రాజెక్టును వెంటనే పూర్తి చేసి మండలంలోని అన్ని చెరువులకు నీటిని అందిస్తే సాగునీటి కష్టాలు తీరుతాయన్నారు. అలాగే వేంపల్లె-రాయచోటి రోడ్డును వెంటనే పూర్తిచేసి అదనపు బస్ సర్వీసులను నడపాలన్నారు. రైతులు, రైతు కూలీలు, చేతివృత్తి వాళ్లకు పంట నష్టం, కరువు సహాయక ఉపాధి పనులు చేపట్టాలన్నారు. పాలకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. తహసీల్దార్, ఎంపీడీఓలకు వినతిపత్రం అందించారు. బీజేపీ నేషనల్ కౌన్సిల్ మెంబర్ కె.రామచంద్రారెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్, బీజేపీ సీనియర్ నాయకులు గాలి హరిప్రసాద్ పాల్గొన్నారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి : ఎంపీడీఓ

సింహాద్రిపురం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎటువంటి రంగంలోనైనా నైపుణ్యం గల పౌరులు నైపుణ్య గణన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కృష్ణమూర్తి పేర్కొన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన నైపుణ్య గణన-2024లో భాగంగా మండల స్థాయి శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నైపుణ్యం గల పౌరులు ఎంత మంది ఉన్నారు, ఎటువంటి నైపుణ్యం గల వారు ఉన్నారు, అనే విషయాలపై ఇటీవలే అమరావతి, విజయవాడలో సర్వే చేశారన్నారు. అలాగే నైపుణ్యం గల వారి వివరాలను సేక రి స్తామన్నారు. పాల్గొన్న వారికి ప్రభుత్వ ఉద్యోగాలలో ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఇందులో ఎవరికివారే స్వతహాగా లాగిన్ అయి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని వివరించారు.

ప్రజా సమస్యలు త్వరగా పరిష్కరించాలి

కడప (ఎడ్యుకేషన్), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కడప కార్పొరేషన్ పరిధిలో ని ప్రజాసమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కమిషనర్ మనోజ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సో మవారం కార్పొరేషన్ వీడి యో కాన్ఫరెన్స్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 అర్జీలు వచ్చాయన్నారు. ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి 7, రెవెన్యూ 5, టౌన్‌ప్లానింగ్ 4,హెల్త్ విభాగం 1, యుపీఏ 1 ఫిర్యాదులు వచ్చాయని, వీటిని సకాలంలో పరిష్కరించాలని సూచించారు.







ఊపందుకున్న టీడీపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదులో క్లస్టర్ ఇన్‌చార్జ్ బుజ్జన్న

చెన్నూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో టీడీపీ సభ్యత్వ నమోదు ఊపందుకుంది. సోమవారం చెన్నూరుతో పాటు రామనపల్లె, కొండపేట, ఉప్పరపల్లె, గుర్రంపాడు గ్రామాల్లో ఆయా ప్రాంత నేతలు సభ్యత్వ నమోదును వేగవంతం చేశారు. మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ బుజ్జన్న, బీసీ సెల్ అధికార ప్రతినిధి వేల్పుల సుబ్రమణ్యం, ఐటీడీపీ చాంపియన్ వేముల మణికంఠ, నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు భవానీ ఆచారి, కొండపేటలో మాజీ సర్పంచ్‌లు మోహన్‌రెడ్డి, ఆర్.సుధాకర్‌రెడ్డి, సంజీవ్‌పవన్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. చెన్నూరులో మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి, మాజీ జిల్లా అధికార ప్రతినిధి శివారెడ్డి, జిల్లా మైనార్టీ నాయకులు షబ్బీర్‌హుసేన్, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి మల్లికార్జునరెడ్డి, రామనపల్లెలో జిల్లా అధికార ప్రతినిధి మన్సూరు అక్బర్, గుర్రంపాడులో తెలుగుయువత జిల్లా అధికార ప్రతినిధి ముండ్ల శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో సభ్యత్వం చేపట్టారు.

ఉర్దూ యూనివర్సిటీలో ప్రొఫెసరు పోస్టులు భర్తీ చేయాలి



ఉర్దూ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్‌కు వినతిపత్రం అందిస్తున్న రూటా ప్రతినిధులు

కడప (ఎడ్యుకేషన్), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఖాళీగా ఉన్న ప్రొఫెసరు పోస్టులు భర్తీ చేయాలని రూటా అధ్యాపకులు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వసీవుల్లా, రాష్ట్ర కోఆర్డినేటరు మహ్మద్‌ఆలీ డిమాండ్ చేశారు. సోమవారం వైస్‌చాన్సలర్ షేక్ షావల్లి ఖాన్‌కు వినతపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముస్లిం మైనారిటీల్లో ఉన్నత విద్యాభివృద్ధికి మహోన్నతమైన ఉద్దేశ్యంతో చంద్రబాబు అబ్దుల్‌హక్ ఉర్దూ యూనివర్సిటీని స్థాపించారన్నారు. గత ఐదేళ్లలో యూనివర్సిటీ అభివృద్ధి చెందలేదని, ఇప్పటికైనా ప్రణాళికలు రూపొందించి అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో సిరాజ్‌బుఖారి, నజీర్ అహ్మద్, పర్వేజ్ పాల్గొన్నారు.

లీగల్ ఎయిడ్ క్లినిక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

కడప రూరల్, నవంబర్ 4 (ఆంధ్రజ్యోతి):కడప నగరం రైతుబజారులో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన లీగల్ ఎయిడ్ క్లినిక్ సేవలను ఇక్కడికి వచ్చే వినియోగదారులు, ప్రజలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్ పేర్కొన్నారు. సోమవారం జడ్జి బాబాఫక్రుద్దీన్ రైతుబజారులోని లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను విజిట్ చేశారు. ఈ సందర్భంగా జడ్జి లీగల్ ఎయిడ్ క్లినిక్‌లోని పారాలీగల్ వాలంటీర్ల విధివిదానాలను తెలియజేశారు. లీగల్ ఎయిడ్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100 గురించి వివరించారు. ప్రజల సమస్యలు ఏవైనా ఉంటే అర్జీల రూపంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థను సంప్రదించవచ్చన్నారు.

టీడీపీ నాయకుడి కుటుంబాన్ని పరామర్శించిన పుత్తా



సుబాన్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

సికెదిన్నె, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో మృతిచెందిన టీడీపీ నాయకుడు వేంపల్లె సుబాన్‌బాష (52) కుటుంబాన్ని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి సోమవారం పరామర్శించారు. మండల కేంద్రమైన చింతకొమ్మదిన్నెకు చెందిన సుబాన్‌కు ఆదివారం రాత్రి గుండె పోటు రావడంతో హుటాహుటిన కడప నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా సోమవారం తెల్లవారుజామున మృతిచెందినట్లు వారి కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న పుత్తా నరసింహారెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. పార్టీ అన్నివిధాలా అండగా ఉంటుందని, అధైర్యపడవద్దని వారి కుటుంబానికి భరోసా ఇచ్చారు. ఏదైనా అవసరం వస్తే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కాగా సుబాన్‌కు భార్య, ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు.

'రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించకపోతే ఆందోళన'

కడప మారుతీనగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కడప అర్బన్, కడప రూరల్, వేంపల్లె, ముద్దనూరు, మైదుకూరు, దువ్వూరు ప్రాంతాల్లో గల రిజిస్ట్రేషను కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించకపోతే ఆందోళన తప్పదని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు గుంటి వేణుగోపాల్ డిమాండ్ చేశారు. సోమవారం పాత రిమ్స్ వద్ద గల దస్తావేజు లేఖరుల ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1864లో కడపలో జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని నిర్మించారని, 2001లో వచ్చిన వరదల వల్ల ఆ కార్యాలయం దెబ్బతిందన్నారు. 2007లో అర్బన్, రూరల్ కార్యాలయాలుగా విభజించిన తరువాత ఇప్పటి వరకు అర్బన్, రూరల్ డీఐజీ కార్యాలయాలు అన్నీ అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయన్నారు. దీంతో లక్షలాది రూపాయలు వృథా అవుతోందన్నారు. కావున జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంతో పాటు డిప్యూటీ ఇన్స్‌పెక్టరు జనరల్, కడప అర్బన్, రూరల్, వేంపల్లె, మైదుకూరు, దువ్వూరు కార్యాలాయలను చేపట్టకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామన్నారు.

మద్యం బాటిళ్ల పట్టివేత

వేంపల్లె, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లపల్లెలోని ఓ దుకాణంలో 9 మద్యం బాటిల్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రంగారావు తెలిపారు. తనిఖీలు నిర్వహిస్తుండగా మద్యం అమ్ముతున్న ఒకరిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.









ఆలయాలకు కార్తీక శోభ

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం తొలి సోమవారం సందర్భంగా పట్టణంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అగస్త్యేశ్వరస్వామి ఆలయం, ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయం, పెన్నాతీరంలోని అమృతేశ్వర ఆలయంతోపాటు పలు ఆలయాల్లో తెల్లవారుజాము నుంచి భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారికి అభిషేకాలు చేశారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు కార్తీక దీపాలు వెలిగించి స్వామివారిని పూజించారు. రామేశ్వరంలోని ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో శ్రీరాముడు ప్రతిష్ఠించిన సైకత లింగానికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి, ఆదిశంకరాచార్యులు ప్రతిష్ఠించిన శ్రీచక్రానికి విశేష పూజలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. హనుమత్‌లింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు స్వామివారికి స్వయంగా అభిషేకాలు నిర్వహించారు. అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ఉదయం, సాయంత్రం భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు.

మైలవరం..: మండలం లోని శివాలయాలు శివనామస్మరణతో కార్తీకశోభ ను సంతరించుకున్నాయి. కార్తీకమాసం మొదటి సోమవారం కావడంతో మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీఅగస్త్యేశ్వరస్వామికోన, దత్తాత్రేయ మునిస్వామికోన, బ్రహ్మ విష్ణు మహేశ్వర స్వామికోన, కల్లుట్ల రామలింగేశ్వరస్వామికోన, గ్రామాల్లోని పలు శివాలయాల్లో భక్తులతో కిటకిటలాడాయి. అగస్త్యేశ్వరస్వామి కోనలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.


ప్రొద్దుటూరు శివాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు


ప్రొద్దుటూరు..ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో...


మైలవరం.. అగస్త్యేశ్వరస్వామి కోనలో...

కొండాపురం..: మొదటి కార్తీక సోమవారం కావడంతో మండలంలోని బాలప్పకోన, మల్లేశ్వరకోన, దొంతి కోన తదితర చోట్లకు భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. అదే విధంగా కొండాపురం,గండ్లూరు, సుగుమంచి పల్లె తదితర శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

బద్వేలుటౌన్..: కార్తీకసోమవారం సందర్భంగా చెన్నంపల్లెలోని భవాని సమేత సోమేశ్వర స్వామి ఆలయం, స్థానిక రూపరాంపేట శివానందస్వామి ఆలయం, శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయం, తెలుగుగంగ కాలనీలోని ఓంకారేశ్వర స్వామి ఆలయం, మృత్యుం జయే శ్వరస్వామి తదితర ఆలయాల్లో భక్తులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. మహిళలు దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

దువ్వూరు..: కార్తీక మాసం సందర్భంగా సోమవారం పాత దువ్వూరులోని భీమలింగేశ్వర ఆలయం, పుల్లారెడ్డిపేటలోని త్రిపీఠకాలయంలో భక్తుల సందడి నెలకొంది. సోమవారం సందర్భంగా పలువురు అయ్యప్పస్వామి మాల ధరించారు.

ఖాజీపేట..: భక్తులతో నాగనాదేశ్వరుని కోన శివనామస్మరణతో కిటకిటలాడింది. కార్తీక మొదటి సోమవారాన్ని పురస్కరించుకుని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. కొండ కిందిభాగంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

మైదుకూరు..: కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా పట్టణంలోని భీమేశ్వరస్వామి ఆలయం, ముక్కొండలోని ముక్కంటీశ్వ రాలయం, పార్వతీనగర్‌లోని ఓంకారేశ్వర స్వామి ఆలయంతో పాటు వనిపెంట, జీవీ సత్రం ప్రాంతాల్లోని వివిధ శివాలయాలకు భక్తులు భారీ సంఖ్యలో వచ్చారు. కాగా సోమవారం సాయంత్రం ఆలయాల్లో వేద పండితుల మంత్రాలతో ఆకాశదీపం వెలిగించారు.

చాపాడు..: మండలంలోని అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవాలయంలో వీరభద్రస్వామిని పలువురు భక్తులు దర్శనం చేసుకున్నారు. కేతవరం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త వీరప్రతాప్ భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో బద్రిపల్లె సర్పంచ్ మల్లేశ్వరి, టీడీపీ నాయకులు గురివిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, గోసుల వీరారెడ్డి, పెరుగు నారాయణ, గుత్తి వీరనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రాజుపాలెం..: కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా టంగుటూరులోని పురాతన దేవాలయం సోమేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పెద్దఎత్తున మహిళలు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. వెల్లాల, అర్కటవేముల, రాజుపాలెం గ్రామాల్లో శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.


కొండాపురం, బద్వేలులో ప్రత్యేక అలంకరణలో స్వామివారు


ఖాజీపేట..ప్రత్యేక అలంకరణలో నాగనాదేశ్వరుడు


మైదుకూరులో ప్రత్యేక అలంకరణలో భీమేశ్వర స్వామి, రాజుపాలెంలో సోమేశ్వరుడు


భక్తులకు అన్నం వడ్డిస్తున్న దృశ్యం

అక్రమ కట్టడం పరిశీలన

ప్రొద్దుటూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కాలువ పోరంబోకు స్థలం ఆక్రమించి నిర్మించిన వాణిజ్య సముదాయాల కట్టడాన్ని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున పరిశీలించారు. సోమవారం శ్రీరాముల పేట వీధిలో నిర్మించిన ప్రైవేటు వాణిజ్య సముదాయం మున్సిపల్ నిబంధనలకు వ్యతిరేకంగా నిర్మించారని మున్సిపల్ కౌన్సిల్లో కౌన్సిలర్లు పలుమార్లు ప్రశ్నించారు. సర్వేలో 1942 నాటి స్ట్రీట్ సర్వే తోపాటు మున్సిపల్ రెవెన్యూ రికార్డులమేరకు మాస్టర్ ప్లాన్‌లో రోడ్ల విస్తీర్ణం మేరకు మళ్లీ ఆ వీధి మొత్తం కొలతలు పెట్టి కొలిచారు. అలాగే కాలువ రికార్డుమేరకు ఎంత పొడవు విస్తీర్ణం వుందో ఫీల్డ్ మీద ఎలా వుందో సర్వే చేశారు. ఈ సర్వేలో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ ఏసీపీ నాగరాజు, టీపీవో చంద్రమోహన్, వార్డు ప్లానింగ్ సెక్రటరీలు, మండల సర్వేయర్ వెంకటలక్ష్మిపాల్గొన్నారు.

టెట్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన టెట్ పరీక్ష ఫలితాల్లో సృజన్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు ప్రతిభ కనపరిచారని డైరెక్టర్లు కె.సృజన్, కె.సునీల్ తెలిపారు.


విద్యార్థినిని అభినందిస్తున్న దృశ్యం

స్కూల్ అసిస్టెంట్, ఎస్‌జీటీ విభాగంలో భారతి 137.26 మార్కులు, అనూష 131.94 మార్కులు, సునీత 128.74, సావిత్రి 128, హైమావతి 123.45, సల్మా 122.63, సాహిత్య 119.24, ఓబులమ్మ 114.62, సరళ 110.35, దీప్తి 113.70, షబనా 108.74, అశ్వనీదేవి 106.18, సునీల్‌కుమార్ 106.6, కృష్ణవేణి 104 మార్కులు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను డైరెక్టర్లు, అధ్యాపకులు సురేష్, ధనుంజయరెడ్డి, శ్రీనివాసులు, నాగార్జున, శ్రీను అభినందించారు.

ఇసుకరీచ్‌లను పరిశీలించిన ఆర్డీవో

కొండాపురం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జమ్మలమడుగు ఆర్డీవో ఆదిమూలం సాయిశ్రీ సోమవారం మండలంలోని ఏటూరు ఇసుకరీచ్‌ను పరిశీలించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా ఇసుక రవాణా జరగాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుత ఇసుకస్టాకు వివరాలను అడిగి తెలుసుకున్నారు.కార్యక్రమంలో తహసీల్దార్ గురప్ప, ఆర్ఐ మహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్యం సీసాలు స్వాధీనం

కేసు నమోదు

పోరుమామిళ్ల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం రవాణా చేస్తున్న యనమల బ్రహ్మయ్య అనే వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి పది మద్యం బాటళ్లు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. సోమవారం టౌన్‌లోని ఇండియన్ ఆయిల్‌పెట్రోలు బంకు వద్ద యనమల బ్రహ్మయ్య అక్రమంగా మద్యం రవాణా చేస్తుండగా వాటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

బద్వేలు పట్టణాభివృద్దే లక్ష్యం

ఆక్రమణలను తొలగిస్తాం

మున్సిపల్ కమిషనర్ వాకమల్ల వెంకటనరసింహారెడ్డి



పలుకు

బద్వేలుటౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బద్వేలు మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా. ప్రధాన రహదారుల్లో పుట్‌పాత్ ఆక్రమణలను తొలగించి వాహనదారులు, పాదాచారులకు ఇబ్బందులు కలగకుండా చూస్తాం. పరిశుభ్రతకు ప్రాధాన్యతను కల్పిస్తున్నామని, దుకాణ దారుల చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా మున్సిపాలిటీ సిబ్బంది చెత్తసేకరణకు వచ్చినప్పుడు వాహనాల్లో వేయాలని సూచించారు. నిబంధనలను అతిక్రమిస్తే జరిమానాలు విధిస్తాం. మున్సిపాలిటీ పరిధిలో కొన్నిచోట్ల ఆక్రమణలను తొలగించామని, మున్సిపాలిటీలో మౌలిక వసతులు కల్పించి పురపాలకు ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేపట్టి బద్వేలు పట్టణాభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళతామంటూ **ఆంధ్రజ్యోతి ప్రత్యేక ఇంటర్వ్యూలో** మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ వాకమల్ల వెంకటనరసింహారెడ్డి

ప్రశ్న : పట్టణంలో ప్రధాన సమస్యలు ఏవి వాటిని గుర్తించారా ?

జవాబు : పట్టణప్రజలను వేధిస్తున్న తీవ్రమైన తాగునీటి సమస్యను గుర్తించాం.వాటి కోసం ప్రత్యేక ప్రణాళికలను సిద్ధంచేసుకొని నీటి సమస్య ఎరిష్కారానికి కృషిచేశాం.

ప్రశ్న : ఇంకా ఏమైనా సమస్యలను గుర్తించారా ?

జవాబు : నీటి సరఫరాతోపాటు పారిశుధ్యం, వీధిలైట్ల సమస్యలు నా దృష్టికి వచ్చాయి, పక్కా ప్రణాళికతో ఆ సమస్యను పరిష్కరించేందుకు కృషిచేస్తాం.

ప్రశ్న: సిబ్బంది కొరత ఉందా ?

జవాబు : పారిశుధ్య కార్మికుల కొరత ఎక్కువగా ఉన్న మాట వాస్తవమే, బద్వేలు పట్టణంలో 90వేల జనాభా ఉన్నారు. వారి కోసం 200 మంది సిబ్బంది ఉండాలి కానీ 100 మంది మాత్రమే పనిచేస్తున్నారు, ఈ సమస్యను ప్రజా ప్రతినిధుల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి త్వరితగతిన సిబ్బంది కొరతను పరిష్కరిస్తాం.

ప్రశ్న : ప్రభుత్వస్థలాల ఆక్రమణలకు గురికాకుండా రక్షణ చర్యలు చేపట్టారా?

జవాబు : మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వస్థలాలు ఆక్రమణకు గురికాకుండా తగిన రక్షణ చర్యలు కల్పించాం, ఇప్పటికే ఆక్రమణలో ఉన్నవాటిని తొలగించాం, ఇంకెవరైనా ఆక్రమణకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: ఆస్తిపన్ను వసూళ్లు ఏ విధంగా ఉన్నాయి. ?

జవాబు : పట్టణపరిధిలో రూ.11కోట్ల రూపాయల ఆస్తిపన్ను ఉన్నాయి, వాటిలో నాలుగుకోట్ల రూపాయల నీటి పన్ను, 7కోట్ల రూపాయల ఇంటి పన్నులు ఉన్నాయి. వాటికి పక్కా ప్రణాళికతో 23 బృందాలను ఏర్పాటు చేశాం, సిబ్బందితో ఎప్పటికప్పుడు పన్నులు వసూళ్లు చేస్తున్నాం.

ప్రశ్న : ప్రభుత్వ పథకాలు పేదలకు చేరేందుకు ప్రణాళికలు రచించారా ?

జవాబు : ప్రభుత్వం చేపట్టే పథకాలు పేదలకు చేరేందుకు ఆయా కార్యాలయాల అధికారులకు, సచివాలయ ఉద్యోగులు, స్థానిక ప్రజా ప్రతినిధుల సహకారంతో కార్యక్రమాలను ప్రజలకు అందుబాటులో ఉంటూ చేరవేస్తున్నాం.

ముమ్మరంగా సభ్యత్వ నమోదు

అట్లూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండూరు, రెడ్డిపల్లె గ్రామాల్లో టీడీపీ సభ్యత్వ నమోదు ముమ్మరంగా జరిగింది. సభ్యత్వ నమోదు ఓటర్ల భవిష్యత్తు కోసమేనని మండల టీడీపీ అధ్యక్షులు పాపుదిప్పు మల్లికార్జునరెడ్డి వెల్లడించారు. కార్యక్రమంలో మండల మాజీ అధ్యక్షుడు అమర్‌నాథరెడ్డి, మహేశ్వర్, క్రిష్టారెడ్డి, రాధాక్రిష్టారెడ్డి, అల్లం వెంకటసుబ్బయ్య, పరమేశ్‌బాబా, వెంకటసుబ్బయ్య, కావేటి కొండయ్య, నరసింహులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పూడిక తీత పనులు

ప్రొద్దుటూరు , నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు పట్టణంలోని ప్రధాన కాలువల్లో జరిగే పూడికతీత పనులు సాగుతున్నాయి. కాలువలకు అప్రోచ్ రోడ్డు వున్న చోట యంత్రాలతో పూడిక తొలగిస్తున్నారు. యంత్రాలు వెళ్లలేని చోట మనుషులతో పూడిక తీత పనులు చేపడతున్నారు. త్వరలో అన్ని చానల్స్‌లో పూడికను పూర్తి స్థాయిలో తొలగిస్తామని కమిషనర్ తెలిపారు.

సర్వే పక్కాగా చేయాలి

ముద్దనూరు నవంబరు4 (ఆంధ్రజ్యోతి): పశుగణన సర్వే పక్కాగా చేయాలని ముద్దనూరు పశువైద్య సహాయ సంచాలకుడు శ్రీనివాస సూచించారు. మండల పరిధి కొత్తపల్లె గ్రామంలో సోమవారం పశువైద్య సిబ్బంది చేపడుతున్న 21వ జాతీయ పశుగణన కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వం రైతుకు సాగు సహాయం అందించాలి

మైదుకూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల హామీలో భాగంగా టీడీపీ ఇచ్చిన రైతుకు సాగు సహాయం 20 వేలు అందించాలని ఏపీ రైతు సంఘం నాయకులు సచివాలయ సిబ్బందికి వినతి పత్రం అందించారు. సోమవారం పట్టణంలోని 8,11వ సచివాలయాలకు వద్దకు రైతు నాయకులు చేరుకొని, వర్షాలు పడి రైతులు సాగుకు సిద్ధం అవుతున్నారన్నారు. నాయకులు శ్రీనివాసులు, భాస్కర్, కొట్టే రామమోహన్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పెట్టుబడి సాయాన్ని అందించాలి

కొండాపురం, నవ ంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతులకు రూ.20 వేలు పెట్టుబడి సాయాన్ని వెంటనే అందించాలని సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు కోరారు.సోమవారం వారు సచివాలయాల్లో కార్యదర్శులకు వినతిపత్రాలను అందజేశారు.ఖరీఫ్‌లో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఏడాది కావస్తున్నా ఇంతవరకు పెట్టుబడి అందించకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు మనోహర్‌బాబు, సుదర్శన్ రెడ్డి, వెంకటరమణ, జయంతు, సుబ్బారావు, జోసఫ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

జమ్మలమడుగు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): 2024 ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రతి రైతుకు రూ.20 వేలు పెట్టుబడి సాయం అందిస్తామని చెప్పినవాగ్దానాన్ని అమలు చేయాలని సీపీఐ రైతు సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు నాగుల కట్టవీధి సచివాలయం అడ్మిన్ చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు శ్రీనివాసులు, సీపీఐ నాయకులు నాగేంద్ర, సుమన్, చేనేత సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణతదితరులు పాల్గొన్నారు.

గండికోట ప్రాజెక్టు నిర్వాసితులకు న్యాయం చేయండి

ముద్దనూరు, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు కింద ముంపునకు గురైన నిర్వాసితులకు భూమి పంపిణీ చేసి న్యాయం చేయాలని సీపీఎం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్వేష్ పేర్కొన్నారు. సోమవారం తహసీల్దారు వరదకిశోర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని చౌటిపల్లె ఆర్‌అండ్‌ఆర్ సెంటర్‌లోని నిర్వాసితులకు మంగపట్నం రెవెన్యూ పొలంలో భూమి కేటాయించడం జరిగిందన్నారు. అయితే అధికారులు ఇంత వరకు పట్టాలు ఇవ్వలేదన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శివకుమార్ పాల్గొన్నారు.

రేపు సీపీఎం మహాసభలు

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు నియోజకవర్గ సీపీఎం మూడో మహాసభలను ఈనెల 6వ తేదీ ఘనంగా నిర్వహించనున్నట్లు సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు. సోమవారం సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యకర్తలు మహాసభలలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శేఖర్, చెన్నారెడ్డి, శ్రీను, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

యువత శక్తిలా మారాలి

పోరుమామిళ్ల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): దళిత యువత అన్యాయాన్ని ఎదిరించే శక్తిగా మారాలని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ ఆశయ సాధన సమితి వ్యవస్థాపకుడు సగిలి జాకోబ్, ప్రముఖ న్యాయవాది జాలా ప్రభాకర్ అన్నారు. సోమవారం పోరుమామిళ్లలోని అంబేద్కర్‌భవన్‌లో డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ ఆశయ సాధన సమితి ఆధ్వర్యంలో మాదిగ యువత చైతన్యసదస్సు నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఎం.పిచ్చయ్య, రాజు, ఏసురత్నం, ప్రసాద్ పాల్గొన్నారు.

పందుల పెంపకానికి స్థలం కేటాయించండి

బద్వేలు, నవంబరు4 (ఆంధ్రజ్యోతి) : పందుల పెంపకం వృత్తిగా జీవిస్తున్న ఎరుకల కుటుంబాలకు ప్రతి కుటుంబానికి 5 సెంట్లు చొప్పున స్థలం కేటాయించి ఆదుకోవాలని గ్రేటర్ రాయలసీమ అభివృద్ధి పోరం నియోజకవర్గ అధ్యక్షుడు చంద్రశేఖర్ పేర్కొన్నారు. సోమవారం సంబంధిత సమస్యపై బద్వేలు ఆర్డీవో, గోపవరం తహసీల్దార్లకు వినతిపత్రం అందజేశారు. ఆ సంఘం నియోజకవర్గ కార్యదర్శి జకరయ్య, రామరాజు, చంద్రమోహన్‌రాజు, బాబు, విజయరావు, జయపాల్ పాల్గొన్నారు.

పేదవాని ఆకలి తీర్చడమే కూటమి లక్ష్యం

ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్


అన్న క్యాంటీన్‌లో టిఫెన్ వడ్డిస్తున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్

మైదుకూరు రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పేదవాని ఆకలి తీర్చడమే కూటమి లక్ష్యంగా భావించి అన్నక్యాంటీన్‌లను ప్రారంభిస్తున్నామని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ తెలిపారు. మైదుకూరులోని ప్రొద్దుటూరు రోడ్డులో సోమవారం అన్నక్యాంటీన్ నూతన భవనాన్ని పుట్టాసుధాకర్‌యాదవ్ ప్రారంభించారు.వార్డు కౌన్సిలర్ నాగేశ్వరి ఎమ్మెల్యేకు ఘనస్వాగతం తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ శ్రీనివాసులరెడ్డి,టీడీపీ పట్టణ అధ్యక్షుడు దాసరిబాబు,బీఎన్ శ్రీనివాసులు,ధనపాల జగన్,ఏపీ రవీంద్ర,ఆకుల క్రిష్ణయ్య,యాపరాల చిన్నకోన సుబ్బారావు,ఐతాబాబు పాల్గొన్నారు.

'పరిశీలించి చర్యలు తీసుకుంటాం'

జమ్మలమడుగు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రతి డీలరు వద్ద స్టాకు వివరాలు, పంపిణీ చేసిన రికార్డును పరిశీలించి చర్యలు తీసుకుంటామని తహసీల్దారు శ్రీనివాసరెడ్డి తెలిపారు. జమ్మలమడుగు రేషన్ డీలర్ల అక్రమాలపై అడ్డుకట్ట వేయాలని పలువురు కార్డుదారులు వాపోయారు. ఇందుకు సంబంధించి 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో సోమవారం 'రేషన్ డీలర్ల అక్రమాలకు ఏది అడ్డుకట్ట' డీలర్లపై కార్డుదారుల ఆగ్రహం, చర్యలు తీసుకోవాలని పలువురు విజ్ఞప్తి అనే కథనం ప్రచురితమైంది. వెంటనే స్పందించిన జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి తహసీల్దారు శ్రీనివాసరెడ్డితో ఉదయాన్నే మాట్లాడినట్లు తహసీల్దారు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దారు సోమవారం సాయంత్రం డీలర్లు అందరినీ సమావేశం ఉందని పిలిచి విచారిస్తానని ఆయన తెలిపారు. అయితే 'ఆంధ్రజ్యోతి'తో తహసీల్దారు మాట్లాడుతూ తాను ఈనెల 1వ తేదీ జమ్మలమడుగులోని రేషన్ పంపిణీ చేసే డీలర్ల వద్దకు తనిఖీ చేసినట్లు అక్కడ కూడా కార్డుదారులు డీలర్లు చేసే మోసాలపై తనకు చెప్పారని తహసీల్దారు చెప్పారు. ప్రతి డీలరు వద్ద స్టాకు వివరాలు, పంపిణీ చేసిన రికార్డును పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. భవిష్యత్తులో డీలర్లు అక్రమాలకు పాల్పడితే నోటీసులు ఇచ్చి డీలర్‌షిప్ రద్దు చేస్తామని తహసీల్దారు తెలిపారు. కాగా కొందరు డీలర్లు కథనం ప్రచురితం కావడంతో వెంటనే 'ఆంధ్రజ్యోతి'కి ఫోన్ చేసి బెదిరించే ప్రయత్నం కూడా చేశారు.

ఆలయ దుకాణగదులను ఖాళీ చేయించినఅధికారులు



జమ్మలమడుగు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పాత బస్టాండులో నారాపురం వేంకటేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన వివిధ దుకాణ భవనాల సముదాయాన్ని సోమవారం రెవెన్యూ అధికారులు ఆదేశాల మేరకు టీటీడీ సిబ్బంది, పోలీసు అధికారులు ఖాళీ చేయించారు. 2009 నుంచి 2012 వరకు ఆ భవనాల్లో కొందరు బాడుగలకు తీసుకుని కొంతవరకు మాత్రమే డబ్బులు చెల్లించి తర్వాత నుంచి చెల్లించడంలేదని ఆరోపణలున్నాయి. పది సంవత్సరాల క్రితం టీటీడీకి సంబంధించిన రెవెన్యూ అధికారులు, దుకాణదారులకు నోటీసులు అందించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు కొందరు రాజకీయం చేస్తూ రూములకు అద్దెలు చెల్లించడంలేదని విమర్శలున్నాయి. రెండు నుంచి మూడు నెలల క్రితం ఆ దుకాణయజమానులకు రూములు ఖాళీ చేయాలని నోటీసులు ఇచ్చినట్లు టీటీడీ సిబ్బంది తెలిపారు. అయినా అనేకసార్లు నోటీసులు ఇచ్చినప్పటికీ అక్కడ బాడుగలకు ఉన్న వారు ఖాళీ చేయడంలేదని ఒకేసారి పోలీసు అధికారులు, సిబ్బందితో వచ్చి ఖాళీ చేయించారు. మొత్తం 12 రూముల్లో సామాన్లను తొలగించి బయట వేశారు. కార్యక్రమంలో నారాపురం వేంకటేశ్వరస్వామి, ఆలయ సిబ్బంది, ఎస్ఐ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

పనులు పరిశీలించిన క్వాలిటీ కంట్రోలర్

పోరుమామిళ్ల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సిమెంటు రోడ్డు పనులను క్వాలిటీ కంట్రోల్ డీఈ, ఏఈలు తనిఖీ చేశారు. ఉపాధి హామీ పథకం ద్వారా పోరుమామళ్ల, రంగసముద్రం పంచాయతీల్లో పరిధిల్లో వేస్తున్న రోడ్లను వారు తనిఖీ చేశారు. ఏఈ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

మైలవరం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తం గా ఉండాలని జమ్మలమడుగు రూరల్ సీఐ గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం బాలికల గురుకుల పాఠశాలలో పోలీసు అమరవీరుల వారోత్సవాలల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన తదితర పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. అనంతరం విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. మైలవరం ఎస్ఐ శ్యాంసుందర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బెల్టు షాపు నిర్వాహకులు అరెస్టు

ముద్దనూరు, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): మండలంలో బెల్టుషాపు నిర్వాహకులపై సోమవారం దాడి చేసి అరెస్టు చేసినట్లు సీఐ దస్తగిరి తెలిపారు.ముద్దనూరు, మంగపట్నం, నల్లబల్లె, సోంపల్లెలో బెల్టు షాపులపై దాడి చేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 40 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.